మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

గురువారం THURSDAY 26-2-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 238 Issue: 238

Published from Jagitial
www.evarthalu.com


26 ఫిబ్రవరి 2026 - గురువారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - శుక్లపక్షం సూర్యోదయం - ఉ. 6:40 సూర్యాస్తమయం - సా. 6:18 తిథి దశమి రా. 12:34ం వరకు తరువాత ఏకాదశి సంస్కృత వారం బృహస్పతి వాసరః నక్షత్రం మృగశిర మ. 12:10 వరకు తరువాత ఆరుద్ర యోగం ప్రీతి రా. 10:33 వరకు కరణం తైతుల మ. 1:37 వరకు గరజి రా. 12:34ం వరకు వర్జ్యం రా. 8:06 నుండి రా. 9:36 వరకు దుర్ముహూర్తం ఉ. 10:32 నుండి ఉ. 11:19 వరకు మ. 3:11 నుండి మ. 3:58 వరకు రాహుకాలం మ. 1:56 నుండి మ. 3:23 వరకు యమగండం ఉ. 6:40 నుండి ఉ. 8:07 వరకు గుళికాకాలం ఉ. 9:34 నుండి ఉ. 11:01 వరకు బ్రహ్మముహూర్తం తె. 5:04 నుండి తె. 5:52 వరకు అమృత ఘడియలు రా. 1:22 నుండి రా. 2:52 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:05 నుండి మ. 12:52 వరకు



## ఇంటికే రైలు పార్సిల్

### రైల్వే శాఖ డోర్ డెలివరీ సేవలు.. ప్రారంభించిన దక్షిణ మధ్య రైల్వే

భారతీయ రైల్వేలో పార్సిల్ యాప్‌తో సరికొత్త అధ్యాయానికి దక్షిణ మధ్య రైల్వే శ్రీకారం చుట్టింది. రైల్వే వినియోగదారులకు సరికొత్త సదుపాయాన్ని అందుబాటులోకి తీసుకువచ్చింది. 'రైల్ పార్సిల్ యాప్' పేరుతో లాజిస్టిక్ సర్వీస్‌ను దక్షిణ మధ్య రైల్వే ప్రారంభించింది.

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): దక్షిణ మధ్య రైల్వే – హైదరాబాద్ రైల్వే డివిజన్ ఆధ్వర్యంలో రైల్ పార్సిల్ యాప్‌ని డెవలప్ చేసింది. సికింద్రాబాద్ రైల్వేలో దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ రైల్ పార్సిల్ యాప్‌ని లాంచ్ చేశారు. ఇంటి వద్దనే పార్సిల్ బుకింగ్, డెలివరీ సర్వీసులను అందించే లక్ష్యంతో 'రైల్ పార్సిల్ యాప్'ను దక్షిణ మధ్య -2 వ పేజీలో...



## ఈ20 పెట్రోల్ అమ్మకాలు తప్పనిసరి

### ఏప్రిల్ 1 నుంచి అమలు: కేంద్రం.. రాష్ట్రాలు, యూటీలకు ఆదేశాలు

ఏప్రిల్ 1 నుంచి అన్ని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాలలో విక్రయించే పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ తప్పనిసరిగా ఉండాలని కేంద్రం స్పష్టం చేసింది. ఈ ఇంధనం కనీసం 95 రీసెర్చ్ ఆక్టేన్ నంబర్ (ఆర్‌ఓఎన్) కలిగి ఉండాలని తెలిపింది. ఆర్‌ఓఎన్ అనేది వాహన ఇంజిన్ లోపల ఒత్తిడిని పెట్రోల్ ఎంత సమర్థవంతంగా నిర్వహించగలదో చూపించే సంఖ్య.

న్యూఢిల్లీ: ఇంజిన్ లోపల ఇంధనం అసమానంగా మండినప్పుడు, అది నాకింగ్ శబ్దాన్ని సృష్టిస్తుంది. దీన్ని ఇంజిన్ నాకింగ్ అంటారు. ఈ నాకింగ్ కాలక్రమేణా ఇంజిన్‌ను దెబ్బతీస్తుంది. ఆర్‌ఓఎన్ -2 వ పేజీలో...



## 'కాళేశ్వరం' విచారణ వాయిదా

### రేపు కేసీఆర్ తరఫున వాదనలు

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హాయంలో భారీ అవినీతి జరిగిందంటూ ప్రస్తుత రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆరోపణలు చేస్తున్న సంగతి తెలిసిందే.

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): ఈ కాళేశ్వరం ప్రాజెక్టుకు సంబంధించిన సమగ్ర సమాచారాన్ని సేకరించేందుకు జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రేవంత్ రెడ్డి సర్కార్ కమిషన్ ఏర్పాటు చేసింది. ఆ కమిషన్ తరువాయి 2 వ పేజీలో...



## ఏది భరోసా?

### ఇంకెప్పుడు అందేది పెట్టుబడి సాయం

### ప్రకటనలకే పరిమితమవుతున్న సీఎం

### ఆలస్యంపై రైతుల్లో నిరాశ, అసహనం

తెలంగాణలో యాసంగి (రబీ) పంటల సాగులో నిమగ్నమైన రైతులు, రైతు భరోసా పెట్టుబడి సాయం నిధుల పంపిణీలో జరుగుతున్న జాప్యంపై తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. సీఎం రేవంత్ రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం 'ఇదిగో.. అదిగో' అంటూ వాయిదాలు వేస్తుండటంతో, లబ్ధిదారులైన రైతుల్లో అసంతృప్తి పెల్లుబుకుతోంది. క్షేత్రస్థాయిలో రైతులు కలిసినప్పుడల్లా ఈ నిధుల విడుదలపై చర్చలు జరుగుతున్నాయి, ఇది వారి ఎదురుచూపులకు నిదర్శనంగా నిలుస్తోంది.

హైదరాబాద్, ఫిబ్రవరి 26 (ఈవార్తలు): ప్రభుత్వం ఏడాదికి ఎకరానికి రూ.12,000 చొప్పున రెండు పర్యాయాలుగా (వానాకాలం, యాసంగి) రైతు భరోసా నిధులు రైతుల బ్యాంకు ఖాతాల్లో జమ చేయాల్సి ఉంది. అయితే, డిసెంబర్‌లో ఇవ్వాల్సిన యాసంగి సాయం జనవరి మొదటి వారంలో అని ఒకసారి, సంక్రాంతికి అని మరోసారి, మున్సిపల్ ఎన్నికల ముందు అని మరోసారి ప్రభుత్వం లీకులు ఇచ్చి వాయిదాలు వేసింది. చివరకు, ఫిబ్రవరి 4న మిర్యాలగూడ మున్సిపల్ ఎన్నికల ప్రచార తరువాయి 2 వ పేజీలో...




## పంట పానం పాయే!

### అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటలు

### ఈదురు గాలులకు నేలకొరిగిన మక్క

### మామిడి తోటల్లో రాలిన పిందెలు, పూత

### జగిత్యాల, నిజామాబాద్ రైతులకు దెబ్బ

**సిద్దిపేటలో ని 200 ఎకరాల పొద్దుతిరుగుడు నేలమట్టం**

ఇటీవల కురిసిన అకాల వర్షాల దెబ్బకు సాగులో ఉన్న పలు రకాల పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. క్షేత్రస్థాయి నుండి అంది సమాచారం ప్రకారం.. ఈదురు గాలుల ధాటికి మొక్కజొన్న పంట అనేక చోట్ల నేలకొరిగింది. ముఖ్యంగా నల్గొండ జిల్లా కేతేపల్లి మండలం, జగిత్యాల జిల్లా ఇబ్రహీంపట్నం మండలాల్లో భారీ నష్టం వాటిల్లింది. పూత మరియు పిందె దశలో ఉన్న మామిడి తోటల్లో ఈదురు గాలుల వల్ల పూత పూర్తిగా రాలిపోయింది.

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్): జగిత్యాల, నిజామాబాద్ జిల్లాల్లో మామిడి రైతులకు కోలుకోలేని దెబ్బ తగిలింది. జగిత్యాల, నిర్మల్ జిల్లాల్లో కలిపి సుమారు 4,850 ఎకరాల్లో మొక్కజొన్న పంట దెబ్బతిన్నది. ఈదురు గాలులకు పంట నేలకొరగడంతో దిగుబడి గణనీయంగా తగ్గే ప్రమాదం ఉంది. జగిత్యాల జిల్లాలోని ఇబ్రహీంపట్నం, మెట్‌పల్లి, కోరుట్ల, మల్యాల మండలాల్లో వర్ష ప్రభావం ఎక్కువగా కనిపించింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట కొన్ని చోట్ల నేలవాలగా, కొనుగోలు కేంద్రాల వద్ద ఆరబోసిన ధాన్యం -2 వ పేజీలో...



## బంగారం-వెండి ధరలు

| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,178 |
| వెండి (గ్రాము): | రూ.290 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,229 |



## సీఎం మౌనం.. నేరం!

### పసికందు హత్య ఘటన దుర్మార్గం

### హంతకులకు రేవంత్ రెడ్డి అండ

### హంతకుడు ఎవరైనా జైల్లో పెట్టాలి

### కుటుంబానికి కోటి పరిహారమివ్వాలి

### కుమ్మెర ఘటనపై కేటీఆర్ డిమాండ్

నాగర్ కర్నూల్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): తెలంగాణ సమాజం మొత్తం ఆవేదనతో తలదించుకునే దుర్మార్గమైన సంఘటన కుమ్మెరలో జరిగిందని బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర మల్లన్న జాతరలో మృతిచెందిన తరువాయి 2 వ పేజీలో...



## రెవెన్యూ ఆధునీకరణ

### ఎమ్మార్వో, ఆర్డీవోలకు శాశ్వత భవనాలు

### రాష్ట్రవ్యాప్తంగా ఒకే నమూనాతో నిర్మాణం

### మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): సౌకర్యవంతమైన, పారదర్శక పరిపాలన అందించే లక్ష్యంతో తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయాలకు శాశ్వత భవనాలు నిర్మించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించిందని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార, పౌరసంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. అద్దె భవనాల్లో కొనసాగుతున్న 60 తాసిల్దార్, 5 ఆర్డీవో కార్యాలయాలకు మొదటి దశలో ఆధునిక సౌకర్యాలతో శాశ్వత భవనాలు నిర్మిస్తామని వెల్లడించారు. శిథిలావస్థలో ఉన్న 170 ఆర్డీవో, తాసిల్దార్ కార్యాలయాలను తరువాయి 2 వ పేజీలో...

## విశ్వవాణి



పెన్సిల్వేనియాలోని మెర్విన్ రాడాబాగ్ అనే రైతు (86) తన పొలం, పశువులను కాపాడుకొనేందుకు సాఫ్ట్‌వేర్ కంపెనీలు ఆఫర్ చేసిన 15 మిలియన్ డాలర్ల (రూ.136 కోట్లు)ను తిరస్కరించాడు. ఆ ప్రదేశంలో డేటా సెంటర్ కట్టాలన్న ప్రయత్నాన్ని అడ్డుకొని లోకల్ హీరో అయ్యాడు.



## యూట్యూబర్ అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

పంజాగుట్ట–హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): 'నా అన్వేషణ' అన్వేష్‌పై పంజాగుట్ట పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. ముఖ్యంగా గత ఏడాది ప్రముఖ నటి కరాటే కళ్యాణి అన్వేష్‌పై హైదరాబాద్ పంజాగుట్ట పోలీస్ తరువాయి 2 వ పేజీలో...

## ఉగ్రవాదాన్ని సహించం

### దశాబ్దాలుగా ఇబ్బంది పడుతున్నాం.. ఇజ్రాయెల్ బాధను అర్థం చేసుకున్నాం

### మీ బాధను మేం పంచుకుంటాం.. ఇజ్రాయెల్ పర్యటనలో ప్రధాని మోదీ

### ఆ దేశ పార్లమెంట్‌లో ప్రసంగం.. తొలి భారత ప్రధానమంత్రిగా రికార్డు



జెరూసలెం: ఇజ్రాయెల్ పర్యటనలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీకి అపూర్వ స్వాగతం లభించింది. బుధవారం ఆ దేశానికి చేరుకున్న మోదీకి.. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు రెడ్ కార్పెట్ వేసి స్వాగతం పలికారు. అనంతరం ఇరువురు నేతలూ ఇజ్రాయెల్ పార్లమెంట్ కెనెస్సెట్‌కు చేరుకున్నారు. ఈ సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆ దేశ పార్లమెంట్‌ను ఉద్దేశించి ప్రసంగిస్తూ.. తరువాయి 2 వ పేజీలో...



## మోదీకి ఇజ్రాయెల్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్'

భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ అత్యున్నత పార్లమెంటరీ గౌరవం దక్కింది. ఇజ్రాయెల్ చట్టసభ 'నెస్సెట్'లో చారిత్రాత్మక ప్రసంగం చేసిన మోదీకి.. ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ అమీర్ ఒహానా స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్‌ను ప్రదానం చేశారు.

## రాశి ఫలాలు
26.2.2026

మేషం: ప్రయాణాలలో శ్రమాధిక్యత. వృత్తి, వ్యాపారాలు నిరాశగా సాగుతాయి. దైవ భక్తి పెరుగుతుంది. వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. ఆర్థికపరంగా అనుకూలంగా ఉంటుంది. వ్యాపారాలు, ఉద్యోగాలలో అదనపు బాధ్యతలుంటాయి. ధన పరంగా కీలక నిర్ణయాలు కలిసి వస్తాయి.

వృషభం: సమాజంలో విశేషమైన ఆదరణ కలుగుతుంది. కుటుంబ విషయంలో ముఖ్యమైన నిర్ణయాలు తీసుకుంటారు. పరిచయాలు పెరుగుతాయి. బంధు మిత్రుల సమాగమం ఆనందం కలిగిస్తుంది. ఉద్యోగమున సమస్యలు తొలగుతాయి. వ్యాపారాలు ఉత్సాహంగా సాగుతాయి.

మిధునం: ప్రయాణాలలో వాహన ఇబ్బందులు కలుగుతాయి. మిత్రులు మీ మాటతో విభేదిస్తారు. చేతిలో డబ్బు నిలువదు. వృధా ఖర్చులు అధికమౌతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు ఉంటాయి. కుటుంబ సభ్యుల ఒత్తిడి అధికమౌతుంది. ఆలయాలు సందర్శిస్తారు.

కర్కాటకం: ఒక విషయమై పెద్దలను కలుసుకుంటారు. శుభకార్యాలలో పాల్గొంటారు. చేపట్టిన పనులలో శ్రమకు తగిన ఫలితం పొందుతారు. దీర్ఘకాలికంగా వసూలుకాని మొండి బాకీలు వసూలు అవుతాయి.వృత్తి, ఉద్యోగాలలో కొన్ని సంఘటనలు ఆశ్చర్యం కలిగిస్తాయి.

సింహం: సన్నిహితుల నుండి కీలకమైన సమాచారం సేకరిస్తారు. మిత్రులతో కొన్ని కార్యక్రమాలలో పాల్గొంటారు. నిరుద్యోగులకు నూతన ఉద్యోగలాభం కలుగుతుంది. చిన్న ప్రయత్నంతో కొన్ని సమస్యలు పరిష్కారం చేసుకుంటారు. వ్యాపారాలు, ఉద్యోగాలలో ఆర్థిక లాభాలుంటాయి.

కన్య: నూతన వ్యాపార ప్రారంభమునకు అవరోధాలు కలుగుతాయి. చిన్న విషయాలకు బంధువులతో మాట పట్టింపులు ఉంటాయి. ధన వ్యవహారాలు మందగిస్తాయి. పనులలో శ్రమ అధికమౌతుంది. ప్రయాణాలలో మార్పులుంటాయి. ఉద్యోగ విషయంలో అధికారులతో సమస్యలు కలుగుతాయి.

తుల: మానసిక ప్రశాంతత కోసం దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. నిలకడలేని ఆలోచనలతో అనారోగ్య సమస్యలు కలుగుతాయి. సహాయం అందించిన సన్నిహితుల నుండి ఒత్తిడి పెరుగుతుంది. వ్యాపారాలు సజావుగా సాగక అసంతృప్తి కలుగుతుంది. వృత్తి, ఉద్యోగమున అదనపు బాధ్యతలుంటాయి.

వృశ్చికం: కుటుంబ వాతావరణం ఉత్సాహంగా ఉంటుంది. గృహమున శుభకార్యముల కొరకు ధన వ్యయం చేస్తారు. ఆధ్యాత్మిక, సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. నూతన వాహన లాభం కలుగుతుంది. ఉద్యోగమున కీలక నిర్ణయాలు తీసుకుని ముందుకు సాగుతారు.

ధనస్సు: భూ సంభందిత క్రయవిక్రయాలు లాభసాటిగా ఉంటాయి. ధన ఆదాయం బాగుంటుంది. చేపట్టిన పనులలో విజయం వరిస్తుంది.పెద్దల నుండి ఆకస్మిక ఆహ్వానాలు అందుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలలో సానుకూల ఫలితాలుంటాయి. వ్యాపారాలు లాభాల బాట పడతాయి.

మకరం: కొన్ని వ్యవహారాలు మధ్యలో ఆపివేస్తారు. బంధు మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. ముఖ్యమైన పనులు మందకొడిగా సాగుతాయి. దూరప్రయాణ సూచనలు ఉన్నవి. పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు. దీర్ఘకాలిక అనారోగ్య సమస్యలు కలుగుతాయి. ఉద్యోగాలు కొంత అస్తవ్యస్తంగా ఉంటాయి.

కుంభం: మిత్రులతో అకారణ కలహాలు కలుగుతాయి. సంతానం విద్యా విషయాలలో ఒత్తిడి పెరుగుతుంది. ఋణ సంబంధిత ఒత్తిడి పెరుగుతుంది. వృత్తి వ్యాపారాలలో ఆలోచనలు కలసిరావు. భాగస్వామ్యం వ్యాపారాలు కలసిరావు. ఉద్యోగాల్లో నిరుత్సహ వాతావరణం ఉంటుంది.

మీనం: సమాజంలో మాటకు విలువ పెరుగుతుంది. సోదరులతో ఆస్తి వివాదాలు సమస్యలు తొలగుతాయి. నూతన వ్యాపార విషయమై సన్నిహితుల సలహాలు స్వీకరిస్తారు. నూతన ఆహ్వానాలు అందుతాయి. వ్యాపార విస్తరణ పనులు వేగవంతం చేస్తారు. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

# ఇంటికే రైలు పార్సిల్

తరువాయి 2 వ పేజీలో...

రైల్వే అందుబాటులోకి తీసుకువచ్చింది. భారతీయ రైల్వేలో తొలిసారిగా ఈ పైలట్ ప్రాజెక్టును హైదరాబాద్ డివిజన్‌లో అమలు చేయడానికి దక్షిణ మధ్య రైల్వే సిద్ధమైంది. మొదటగా 7 నగరాల్లో 'రైల్ పార్సిల్ యాప్' సేవలను ప్రారంభించింది. హైదరాబాద్, విజయ వాడ, విశాఖపట్నం, గుంటూరు, రాజమం డ్రి, బెంగళూరు, చెన్నైలలో ఈ సర్వీసులని అందుబాటులోకి తెచ్చింది. దక్షిణ మధ్య రైల్వే.. ఇతర మూడు లాజిస్టిక్ పార్టనర్స్‌తో కలిసి డోర్ టు, మిడిల్, మెయిన్ డెలివరీ సర్వీసులకి శ్రీకారం చుట్టింది. ఈ సందర్భంగా దక్షిణ మధ్య రైల్వే జీఎం సంజయ్ కుమార్ శ్రీవాత్సవ మాట్లాడారు. ప్రజలు నేరుగా మీ ఇంటి వద్ద నుంచే 'రైల్ పార్సిల్ యాప్' సేవలని వినియోగించుకోవచ్చని సూచించారు. ఈ యాప్‌తో అతి సులువుగా, వేగంగా పార్సిల్స్ సేవలని అందుబాటులోకి తీసుకొచ్చామని పేర్కొన్నారు. దీంతో పాటు దక్షిణ మధ్య రైల్వేలో ఫ్రైట్ లాజిస్టిక్స్ మార్కెట్‌పై అధ్యయనం చేయడానికి ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్ (ఐఐఎం)- బెంగళూరుతో అవగాహన ఒప్పందం చేసుకుందని వివరించారు. రైల్ పార్సిల్ యాప్.. ఫస్ట్ మైల్ (పికప్), మిడ్ మైల్ (రైల్వే ద్వారా రవాణా), లాస్ట్ మైల్ (డెలివరీ) సేవలను సమగ్ర డిజిటల్ ప్లాట్‌ఫాం ద్వారా అనుసంధానించేలా ఈ యాప్ సేవలు ఉంటాయని తెలిపారు. ఇది పార్సిల్ సేవలను సులభతరం చేస్తుందని తెలిపారు. వినియోగదా రులు ఇంటి నుంచి పార్సిల్ సరుకులను బుకింగ్ చేయడానికి, ట్రాక్ చేయడానికి వన్‌స్టాప్ వేదికగా ఈ యాప్ ఉపయోగపడుతుందని వెల్లడించారు. పరిశ్రమ, వినియోగదారులు, వ్యాపారాలు, లాజిస్టిక్స్ భాగస్వాములను ఒకే డిజిటల్ పర్యావరణ వ్యవస్థ కిందకు తీసుకురావడానికి ఈ యాప్‌ని రూపొందించామని పేర్కొన్నారు.

# రెవెన్యూ ఆధునీకరణ

మొదటి పేజీ తరువాయి

రెండవ విడతలో నిర్మిస్తామని వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని భవనాలు ఒకే నమూనాలో, ప్రజలకు అందుబాటులో ఉండేలా డిజైన్ చేయనున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో చర్చించి డిజైన్లకు తుది రూపు ఇస్తామన్నారు. తక్కువ ఖర్చుతో ప్రజలకు అత్యుత్తమ సేవలు అందేలా ఈ భవనాల నిర్మాణం ఉంటుందని మంత్రి తెలిపారు. బుధవారం సచివాలయంలోని తన కార్యాలయంలో రెవెన్యూ శాఖ ఉన్నతాధికారులతో మంత్రి సమీక్ష నిర్వహించారు. రాష్ట్రంలో ఎన్ని తాసిల్దార్, ఆర్డీవో కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగుతున్నాయి? ఎన్ని శిథిలావస్థకు చేరుకుని, పాలనకు అనువుగా లేనివి ఉన్నాయనే వివరాలను సేకరించారు. ప్రభుత్వ కార్యాలయాలు అద్దె భవనాల్లో కొనసాగడం సరైంది కాదని, ప్రజలకు సేవలందించే కేంద్రాలు గౌరవప్రదంగా ఉండాలన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆలోచనకు అనుగుణంగా ఈ నిర్ణయం తీసుకున్నామని మంత్రి వివరించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పడక ముందు, ఏర్పడిన తర్వాత కూడా రెవెన్యూ కార్యాలయాలు ప్రజలకు సౌకర్యవంతంగా లేకపోవడంతోపాటు చాలా వరకు అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయని మంత్రి పొంగులేటి అన్నారు. గత ప్రభుత్వం ముందుచూపు, ప్రణాళిక లేకుండా మండలాల పునర్విభజన చేపట్టిందని, కొన్ని మండలాలు రెండు మూడు జిల్లాల పరిధిలోకి వచ్చేలా చేశారని మంత్రి విమర్శించారు. అనేక కార్యాలయాల్లో కనీస వసతులు లేకపోవడం, సిబ్బంది కొరత తీవ్రంగా ఉండడం వల్ల ప్రజలు ఇబ్బందులు పడ్డారని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కొత్త మండలాలకు అవసరమైన పోస్టులు మంజూరు చేసి పరిపాలనను బలోపేతం చేశామని తెలిపారు. అలాగే ప్రజలకు దూరంగా కలక్టరేట్‌లను నిర్మించి నిర్వహణను గాలికివదిలేశారని విమర్శించారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖలో అత్యాధునిక వసతులతో సమీకృత భవనాల నిర్మాణానికి శ్రీకారం చుట్టామని మంత్రి పొంగులేటి తెలిపారు. ఔటర్ రింగ్ రోడ్ పరిధిలోని హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజిగిరి, సంగారెడ్డి జిల్లాల్లోని 39 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను 12 క్లస్టర్లుగా విభజించి సమీకృత భవనాలు నిర్మిస్తున్నామని చెప్పారు.ఇప్పటికే గచ్చిబౌలి, మేడ్చల్ మల్కాజిగిరి, పటాన్ చెరువులలో భవనాలకు శంకుస్థాపన పూర్తయ్యిందని, గచ్చిబౌలిలో నిర్మాణ పనులు తుది దశలో ఉండి మరికొద్ది నెలల్లో ప్రారంభానికి సిద్ధమవుతుందని తెలిపారు. రాష్ట్రంలో రెవెన్యూ వ్యవస్థను ఆధునికీకరించి, ప్రజలకు వేగవంతమైన సేవలు అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

## 'కాళేశ్వరం' విచారణ వాయిదా

మొదటి పేజీ తరువాయి

కాళేశ్వరం ప్రాజెక్టును పరిశీలించి.. రాష్ట్ర ప్రభుత్వానికి కొన్ని నెలల క్రితమే నివేదికను సమర్పించింది. ఆ నివేదికలో కాళేశ్వరం ప్రాజెక్టు కుంగిపోవడంలో మాజీ సీఎం కేసీఆర్, రాష్ట్ర మాజీ నీటి పారుదల శాఖ మంత్రి హరీష్ రావు సహా పలువురు ప్రత్యక్షంగా, పరోక్షంగా పాత్ర ఉందని కమిషన్ ఆరోపించింది. ఈ నేపథ్యంలోనే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ అంతా తప్పుడు నివేదిక ఇచ్చిందని.. ఆ రిపోర్ట్‌ను రద్దు చేయాలంటూ.. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్.. మాజీ మంత్రి, బీఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు.. ఐఏఎస్ స్మితా సబర్వాల్.. మాజీ సీఎస్ ఎస్‌కే జోషి సహా పలువురు వేర్వేరుగా గతంలోనే తెలంగాణ హైకోర్టులో పిటిషన్లు దాఖలు చేశారు. ఈ క్రమంలోనే ఆ పిటిషన్లపై బుధవారం రోజున తెలంగాణ హైకోర్టు విచారణ చేపట్టింది. కాళేశ్వరం ప్రాజెక్టుపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ సందర్భంగా హరీష్ రావు తరఫున సుప్రీంకోర్టు లాయర్ సుందరం వాదనలు వినిపించారు. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్.. తమకు ఉన్న పరిధిని దాటి మరీ వ్యవహరించిందని లాయర్ సుందరం వాదించారు. కమిషన్ ఆఫ్ ఎంక్వయిరీస్ చట్టం ప్రకారం ఈ జస్టిస్ పీసీ ఘోష్ రిపోర్ట్ చెల్లదని కోర్టుకు విన్నవించారు. మేడిగడ్డ బ్యారేజీ పిల్లర్ కుంగిపోతే రాష్ట్ర ప్రభుత్వం కమిషన్ ఏర్పాటు చేసిందని.. అయితే అక్కడ ఏం జరిగిందో పరిశీలించి కమిషన్ నివేదిక ఇవ్వాలని.. ఆ బాధ్యత మాత్రమే కమిషన్‌పై ఉంటుందని పేర్కొన్నారు. కానీ పీసీ ఘోష్ కమిషన్ తన పరిధి దాటి రిపోర్ట్ ఇచ్చిందని తెలిపారు. అందుకే జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ రిపోర్టు చెల్లదని.. దాన్ని రద్దు చేయాలని వాదనలు వినిపించారు. లాయర్ సుందరం వాదనలు విన్న హైకోర్టు.. ఈ వ్యవహారంలో తదుపరి విచారణను ఈనెల 27వ తేదీకి వాయిదా వేసింది.

# సీఎం మౌనం.. నేరం!

మొదటి పేజీ తరువాయి.

చిన్నారి కుటుంబాన్ని కేటీఆర్ బుధవారం పరామర్శించారు. నాగర్‌కర్నూల్‌లోని అంబేద్కర్ కూడలిలో కుమ్మెర గ్రామస్థులు చేపట్టిన ధర్నాకు ఆయన మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎంపీ కుమ్మెర గ్రామంలో పసిపాప ప్రాణాలు తీసిన హంతకులకు అండగా నిలబడుతున్నారని ఆరోపించారు. ఈ ఘటనపై ప్రభుత్వం, ముఖ్యమంత్రి మౌనంగా ఉండటం సరికాదని అన్నారు. మల్లన్న స్వామి జాతరలో దేవుడికి దండం పెట్టుకునే అవకాశం అడిగితే, ఆ కుటుంబంపైన తీవ్రంగా దాడి చేసి మానవత్వానికే మచ్చ తెచ్చారన్నారు. 21వ శతాబ్దంలో కూడా కులాలు మతాల పేరిట ఒకరిని చిన్నగా చూడటం, అవమానించడం, అధికారాన్ని అండగా పెట్టుకుని హత్యా రాజకీయాల్ని, హత్య చేసిన హంతకులను కాపాడే ప్రయత్నం జరగడం నిజంగా సిగ్గుచేటని అన్నారు. ఈరోజు పసిపాప హంతకులకు అండగా నిలబడ్డ ప్రతి ఒక్కడు దోషే అని అన్నారు. హంతకుడు ఎవరైనా, ఏ పార్టీకి చెందిన వారైనా వారిని జైల్లో పెట్టాలని డిమాండ్ చేశారు. దాడి చేసిన 8 మంది పైన ముమ్మాటికి హత్యానేరం కింద కేసులు నమోదు చేసి, అరెస్ట్ చేయాలని అన్నారు. పసిపాపను హత్య చేసిన వారి పైన చర్యలు తీసుకోవడంతో పాటు, ఆ కుటుంబానికి కోటి రూపాయల నష్ట పరిహారం అందించాలని కేటీఆర్ డిమాండ్ చేశారు. పసిపాపను హత్య చేసిన హంతకులను శిక్షించి జైల్లో వేయాలని... అవసరమైతే ఉరిశిక్ష వేయాలి కానీ బయటకి వదలవద్దని కోరారు. ప్రభుత్వం అధికారం అడ్డం పెట్టుకుని పోలీసులతో ఈ హత్యను తప్పుదోవ పట్టిస్తుందని కేటీఆర్ ఆరోపించారు. ఇంత అమానవీయమైన సంఘటన జరిగితే... ప్రభుత్వం, ముఖ్యమంత్రి మౌనంగా ఉండడం క్షమించరాని నేరం అన్నారు. ఈరోజు తాను ఒక రాజకీయ నాయకుడిగా కాకుండా, ఒక తండ్రిగా, సమాజంలోని ఒక వ్యక్తిగా ఈ కుటుంబానికి అండగా నిలబడేందుకు వచ్చినట్లు కేటీఆర్ తెలిపారు. ఈరోజు పసిపాప ప్రాణాలు పోయిన తీరు మాటలకు అందని మహా విషాదమని కేటీఆర్ అన్నారు. ఇంతటి అమానవీయమైన సంఘటన జరిగినప్పుడు రాజకీయాలు మాట్లాడవలసిన అవసరం లేదని అన్నారు. కానీ ఆ కుటుంబానికి న్యాయం జరిగేదాకా పోరాటం చేయాల్సిన బాధ్యత అందరిపైన ఉందని అన్నారు. మీడియా, రాజకీయ నాయకులు, ప్రజలు ప్రతి ఒక్కరు కూడా ఈ పోరాటంలో ఆ కుటుంబానికి అండగా నిలబడాల్సిన అవసరం ఉందని చెప్పారు. బాధిత కుటుంబానికి తాము అండగా ఉంటామని, వారికి పది లక్షలతో ఇల్లు కట్టిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు. తక్షణ సహాయంగా లక్ష రూపాయల ఆర్థిక సహాయం అందించారు.

# ఏది భరోసా?

తరువాయి 2 వ పేజీలో...




సభలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా 'మున్సిపల్ ఎన్నికల ప్రక్రియ ముగిశాక రైతుల ఖాతాల్లో నిధులు జమ చేస్తాం' అని ప్రకటించారు. అయితే, ఎన్నికలు ముగిసి వారం దాటినా, నిధుల విడుదల జరగకపోవడంతో రైతాంగంలో అసహనం మరింత తీవ్రమైంది. ఇటీవల జరిగిన కేబినెట్ భేటీలో కూడా రైతు భరోసాపై చర్చ జరగకపోవడం రైతుల ఆగ్రహానికి మరింత ఆజ్యం పోసింది. బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి టి. హరీశ్ రావు ఈ విషయాన్ని తీవ్రంగా ఖండిస్తూ, మున్సిపల్ ఎన్నికలు ముగిసి పది రోజులు దాటినా నిధులు ఇవ్వకపోవడం రైతులను మోసం చేయడమే అని విమర్శించారు. కేబినెట్ భేటీలో రైతు భరోసా ఊసు లేకపోవడంతో, రైతులు 'యాసంగి సాగుకు అప్పులు చేశాం, ఈ నిధులతో తీర్చుకుంటామని భావించాం' అంటూ రైతులు అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రతిపక్షాలు కాంట్రాక్టులు, కమిషన్లు, రియల్ ఎస్టేట్ అంశాలపైనే కేబినెట్ దృష్టి సారించిందని ఆరోపిస్తున్నారు. కొందరు రైతులు 'జిల్లా, మండల పరిషత్ ఎన్నికల వరకు వాయిదా పడుతుందేమో' అని ఆందోళన చెందుతున్నారు. పార్లమెంట్ ఎన్నికల సమయంలోనూ రైతు భరోసాపై మభ్యపెట్టే మాటలు చెప్పిన సీఎం, మున్సిపల్ ఎన్నికల వేళ కూడా అదే తీరును కొనసాగించారన్న భావన రైతుల్లో వ్యాపిస్తోంది. ఎరువుల కోసం యూరియా యాప్ ఇబ్బందులు, సన్న ధాన్యం బోనస్ ఎదురుచూపులు, ధాన్యం కొనుగోలు జాప్యాలు వంటివి రైతులను మరింత ఇబ్బంది పెడుతున్నాయి. మున్సిపల్ ఎన్నికలకు ముందు రూ.9 వేల కోట్లు ఆర్బీఐ నుంచి సమీకరించిన ప్రభుత్వం, చెప్పిన మాట ప్రకారం నిధులు విడుదల చేయకుండా జాప్యం చేస్తుండటం రైతుల సహనాన్ని పరీక్షిస్తోంది. కేసీఆర్ ప్రభుత్వంలో సమయానికి రెండు పంటలకు రైతు భరోసా అందిన రైతులు, ఇప్పుడు రేవంత్ సర్కార్ తీరును జీర్ణించుకోలేకపోతున్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితుల పేరుతో గత వానకాలంలో మూడు ఎకరాల వరకే సాయం పరిమితం చేయడం కూడా అసంతృప్తికి కారణమైంది. ఉద్యోగులు, ఐటీ చెల్లింపుదారులు, ఉన్నతాదాయ వర్గాల భూములను మినహాయించి, చిన్న-సన్నకారు రైతులకు కనీసం ఒక కుటుంబానికి 5 ఎకరాల వరకు సాయం అందించాలని రైతాంగం డిమాండ్ చేస్తోంది. ప్రభుత్వం తాజాగా 'మోడల్ కోడ్ ముగిసిన వెంటనే నిధులు జమ చేస్తాం' అని ప్రకటించినప్పటికీ ఫిబ్రవరి చివరి వారంలోనూ విడుదల జరగకపోవడంతో రైతులు రచ్చబండల వద్ద బహిరంగంగా అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. రైతులు అప్పుల పాలవుతున్నారని, త్వరలో నిధులు విడుదల చేయాలని విపక్షాలు డిమాండ్ చేస్తున్నాయి.

## మోదీకి ఇజ్రాయెల్ 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్'

జెరూసలెం: భారత ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి ఇజ్రాయెల్ అత్యున్నత పార్లమెంటరీ గౌరవం దక్కింది. ఇజ్రాయెల్ చట్టసభ 'నెస్సెట్'లో చారిత్రాత్మక ప్రసంగం చేసిన మోదీకి.. ఆ దేశ పార్లమెంట్ స్పీకర్ అమీర్ ఒహానా 'స్పీకర్ ఆఫ్ ది నెస్సెట్ మెడల్'ను ప్రదానం చేశారు. ఈ పురస్కారం అందుకున్న తొలి భారత ప్రధానిగా ఆయన రికార్డు సృష్టించారు. భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక సంబంధాలను బలోపేతం చేయడంలో మోదీ చూపిన అసాధారణ నాయకత్వానికి గుర్తింపు గా ఈ అత్యున్నత పతకాన్ని అందజేశారు. ఇజ్రాయెల్, పాలస్తీనా (2018 లో గ్రాండ్ కాలర్) రెండు దేశాల నుంచి అత్యున్నత పురస్కారాలు అందుకున్న అరుదైన ప్రపంచ నేతగా మోదీ సరికొత్త చరిత్ర లిఖించారు.

## ఉగ్రవాదాన్ని సహించం

మొదటి పేజీ తరువాయి

భారత్ ఉగ్రవాదానికి పూర్తి వ్యతిరేకమని, అనేక దశాబ్దాలుగా ఈ సమస్యతో తాము ఇబ్బంది పడుతున్నామని అన్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో ఇజ్రాయెల్‌కు భారత్ అండగా ఉంటుందని పేర్కొన్నారు. ఈ దేశ పార్లమెంట్‌లో ప్రసంగించిన మొట్టమొదటి భారత ప్రధానిని తానే కావడం గొప్ప గౌరవంగా భావిస్తున్నానని చెప్పారు. రెండోసారి ఇజ్రాయెల్‌కు రావడం చాలా ఆనందంగా ఉందని అన్నారు. ప్రధాని పర్యటనకు ముందు ఇజ్రాయెల్ ప్రధాని షడ్భుజి కూటమిని భారత్‌తో కలిసి ఏర్పాటుచేయనున్నట్టు ప్రకటించిన సంగతి తెలిసిందే. అక్టోబరు 2023 హమాస్ నరమేధాన్ని 26/11 ముంబయి మారణహోమంతో మోదీ పోల్చారు. "మీ బాధను మేము అర్థం చేసుకుంటున్నాం. మీ బాధను మేము పంచుకుంటాం. ఆ క్షణం తర్వాత కూడా ఇజ్రాయెల్‌కు భారత్ పూర్తి మద్దతుగా నిలుస్తుంది" అని మోదీ అన్నారు. భారత్, ఇజ్రాయెల్ సంబంధాలు రక్తం, త్యాగాలతో లిఖింపబడిందని అన్నారు. మొదటి ప్రపంచ యుద్ధంలో 4 వేల మందికిపైగా భారతీయ సైనికులు ఇదే ప్రాంతంలో అమరులయ్యారని, 1918 సెప్టెంబరులో హైఫా వద్ద జరిగిన అశ్వికదళ దాడి సైనిక చరిత్రలో ఒక ముఖ్యమైన అధ్యాయంగా మిగిలిపోయిందని మోదీ గుర్తుచేశారు. అలాగే, ఇజ్రాయెల్‌ను ఇండియా అధికారికంగా గుర్తించిన రోజునే తాను పుట్టానని మోదీ తెలిపారు. రెండో ప్రపంచ యుద్ధం తర్వాత ఇజ్రాయెల్ 1948లో ఆవిర్భించగా.. భారత్ దీనిని 1950 సెప్టెంబరు 17న గుర్తించింది. ఇక, ఇజ్రాయెల్ ప్రదాని నెతన్యాహు మాట్లాడుతూ.. భారత ప్రధాన మంత్రి మా దేశంలో పర్యటించడం ఎంతో సంతోషకరమని అన్నారు.

## పంట పానం పాయే!

మొదటి పేజీ తరువాయి

తడిసిపోయింది. ఖమ్మం, మహబూబాబాద్ జిల్లాల్లో కల్లాల్లో ఆరబోసిన మిర్చి పంట వర్షానికి తడిసి ముద్దయింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంటతో పాటు, కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యం బస్తాలు కూడా కొన్ని చోట్ల తడిసిపోయాయి. సిద్దిపేట జిల్లాలో సుమారు 200 ఎకరాల్లో సన్‌ఫ్లవర్ పంట నేలమట్టమైనట్లు తెలిసింది. సిద్దిపేట జిల్లా దుబ్బాక నియోజకవర్గంలోని తొగుట, రాయపోల్, మిరుదొడ్డి మండలాల్లో దాదాపు 4,000 వేల ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు సమాచారం. రాళ్ల వాన కారణంగా నిజామాబాద్, మెదక్ జిల్లాల్లో పంటలకు నష్టం వాటిల్లింది. పంట నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.20,000 నుంచి రూ.25,000 వరకు నష్టపరిహారం చెల్లించాలని ప్రతిపక్ష నేతలు, రైతులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం వెంటనే క్షేత్రస్థాయిలో సర్వే నిర్వహించి, బాధితులను ఆదుకోవాలని రైతు సంఘాలు కోరుతున్నాయి. కాగా, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు ఇగ్రామాల్లో పర్యటించి నష్టంపై ప్రాథమిక నివేదికలు సిద్ధం చేస్తున్నారు.

## అన్వేష్‌పై లుకౌట్ నోటీసులు

మొదటి పేజీ తరువాయి

స్టేషన్లో ఇచ్చిన ఫిర్యాదు మేరకే పోలీసులు ఈ చర్యలు తీసుకున్నారు. అన్వేష్ సోషల్ మీడియా వేదికగా హిందూ దేవతలపై వివాదాస్పద వ్యాఖ్యలు చేశారని, భక్తుల మనోభావాలు దెబ్బతీసేలా అసభ్యకరంగా వీడియోలు విడుదల చేశారు అంటూ కరాటే కళ్యాణి తన ఫిర్యాదులో పేర్కొన్న విషయం తెలిసిందే. అప్పట్లో అన్వేష్ పై కేసు నమోదు చేసిన పోలీసులు ఇప్పుడు దర్యాప్తును వేగవంతం చేశారు. అందులో భాగంగానే ఈ లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అన్వేష్ ఏ విమానాశ్రయంలో దిగినా సరే విమానాశ్రయ అధికారులు వెంటనే గుర్తించి పోలీసులకు సమాచారం అందించే అవకాశం ఉంటుంది.

## ఈ20 పెట్రోల్ అమ్మకాలు తప్పనిసరి

మొదటి పేజీ తరువాయి

ఎంత ఎక్కువగా ఉంటే, ఇంధనం నాకింగ్‌ను అంత బాగా తట్టుకుంటుంది. సహజంగా, ఇథనాల్ అధిక ఆక్టేన్ విలువ(సుమారు 108 ఆర్‌ఓఎన్) ను కలిగి ఉంటుంది. కాబట్టి పెట్రోల్‌లో 20 శాతం ఇథనాల్ వల్ల ఇంజిన్ నాకింగ్‌ను తట్టుకునే సామర్థ్యం కలిగి ఉంటుంది. చమురు కంపెనీలు ఈ నియమాలను పాటించాల్సి ఉంటుంది. అయితే ప్రభుత్వం పరిమిత సమయం వరకు ప్రత్యేక పరిస్థితుల్లో, కొన్ని ప్రాంతాలకు ప్రత్యేక మినహాయింపును ఇచ్చింది. ఈ మేరకు చమురు మంత్రిత్వ శాఖ నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. దేశవ్యాప్తంగా బ్యూరో ఆఫ్ ఇండియన్ స్టాండర్డ్స్ (బీఐఎస్) ప్రమాణాల ప్రకారం, దేశవ్యాప్తంగా 20 శాతం వరకు ఇథనాల్ మిశ్రమం, కనీసం ఆర్‌ఓఎన్95 కలిగిన పెట్రోల్‌ను మాత్రమే చమురు సంస్థలు విక్రయించాలి.

# డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలి

**జర్నలిస్టు సంఘాల డిమాండ్.. గన్ పార్కు నుంచి మీడియా అకాడమీకి ర్యాలీ.. అకాడమీ ఎదుట బైఠాయించి నిరసన**




హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): అర్హులైన డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని వివిధ జర్నలిస్టు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. ప్రభుత్వం జారీ చేసిన 252 జీవోను రద్దుచేసి గతంలో ఇచ్చిన మాదిరిగానే జర్నలిస్టులందరికీ న్యాయం జరిగేలా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. బుధవారం డెస్క్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో టీడబ్ల్యూజేఎఫ్, టీయూడబ్ల్యూజే(143), కేబుల్ నెట్వర్క్, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా సంఘాల ప్రతినిధులు హైదరాబాద్ లోని గన్ పార్క్ వద్ద అమరవీరుల స్తూపానికి నివాళులర్పించి.. డెస్క్ జర్నలిస్టులందరికీ న్యాయం జరగాలంటూ స్లొగన్స్ చేశారు. అనంతరం తెలంగాణ మీడియా అకాడమీ వరకు ర్యాలీ నిర్వహించారు. అకాడమీ ఎదుట బైఠాయించి ఆందోళన చేపట్టారు. మీడియా అకాడమీ సెక్రటరీకి వినతి పత్రం అందజేసి తమ డిమాండ్లు తెలియజేశారు. ఈ సందర్భంగా డెస్క్ జర్నలిస్టుల సంఘం ప్రెసిడెంట్ బాదిని ఉపేందర్ మాట్లాడుతూ.. సవరణ జీవో 252 ప్రకారం అక్రిడేషన్లు జారీ చేస్తే డెస్క్ జర్నలిస్టులు అన్యాయానికి గురవుతారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్రిడేషన్లు తగ్గించడం అంటే జర్నలిస్టులకు సంక్షేమాన్ని దూరం చేయడమే అవుతుందని అన్నారు. జర్నలిస్టులకు ఇస్తున్న హెల్త్ కార్డులు అన్ని ప్రైవేట్ ఆసుపత్రుల్లో చెల్లుబాటు అయ్యేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఒక్కో ఎడిషన్ సెంటర్లో నాలుగైదు జిల్లాల డెస్కులు ఉన్నాయని, వారందరికీ జిల్లాకు నాలుగు చొప్పున ఎడిషన్ సెంటర్ల పరిధిలోని అక్రిడేషన్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. అర్హత కలిగిన ఏ ఒక్క డెస్క్ జర్నలిస్టుకు అన్యాయం జరగకుండా చూడాలని ప్రభుత్వానికి ఉపేందర్ విజ్ఞప్తి చేశారు. టీడబ్ల్యూజేఎఫ్ ప్రెసిడెంట్ మామిడి సోమయ్య మాట్లాడుతూ.. అక్రెడిటేషన్ ల సంఖ్యకు పత్రికల సర్కులేషన్ కు లింకు పెట్టడం సరికాదని అన్నారు. పత్రికల సర్క్యులేషన్ ఎంత ఉన్నప్పటికీ.. పని చేసే జర్నలిస్టుల సంఖ్య తగ్గట్లేదు కాబట్టి.. సర్క్యులేషన్ నిబంధనను ఎత్తేయాలని డిమాండ్ చేశారు. ఆర్ఎన్ఐ గుర్తింపు ఉన్న పత్రికల్లో పనిచేస్తున్న డెస్క్ జర్నలిస్టులందరికీ అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. టీయూడబ్ల్యూజే(143) ట్రెజరర్ యోగానంద్ మాట్లాడుతూ.. రాష్ట్ర సర్కారు జర్నలిస్టుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. అన్ని విషయాల్లోనూ జర్నలిస్టులను చిన్న చూపు చూస్తోందని మండిపడ్డారు. టీజేఎస్ ప్రధాన కార్యదర్శి రాజారాం మాట్లాడుతూ.. జిల్లా అక్రిడేషన్ కమిటీల్లో డెస్క్ జర్నలిస్టులకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. కార్టూనిస్టులకు, డిజిటల్ మీడియా డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్ లు మంజూరు చేయాలన్నారు. నిరసన ర్యాలీలో ఎస్ వెంకటేష్, టి శ్రీనివాస్, రవి, డీజే ఎస్ నేతలు సత్య ప్రసాద్, రమేష్, వెంకటరమణ జర్నలిస్టులు పద్మ, సైదిరెడ్డి, వెంకటేష్, ఆర్.రమేష్, కృష్ణారావు, జనార్ధన్, సదానందం, రాజు, యాదగిరి రెడ్డి, రవీందర్, నరేష్, రాజశేఖర్ గౌడ్, వెంకటేశ్వరరావు, ఉదయ్ కుమార్, విజయ్ తో పాటు కేబుల్ , డిజిటల్ మీడియా ప్రతినిధులు, పలు సంఘాల జర్నలిస్టులు పాల్గొన్నారు.

## గాంధీలో 'ఐవీఎఫ్' సక్సెస్.. తొలి బిడ్డ జననం

ముషీరాబాద్–హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): తెలంగాణ ప్రభుత్వ వైద్యరంగంలో మరో అద్భుతం ఆవిష్కృతమైంది. సికింద్రాబాద్ లోని గాంధీ ఆసుపత్రిలో ఐవీఎఫ్ పద్ధతి ద్వారా ఓ మహిళ పండంటి బిడ్డకు జన్మనిచ్చింది. ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్టేట్ ఆఫ్ ది ఆర్ట్ ఐవీఎఫ్ సెంటర్లో చికిత్స పొందిన దంపతులకు సంతానం కలిగింది. గైనకాలజీ మరియు ఎంబ్రియాలజీ నిపుణుల బృందం పర్యవేక్షణలో ఈ ప్రసవం విజయవంతంగా జరిగింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ ఇద్దరూ క్షేమంగా ఉన్నారని ఆసుపత్రి సూపరింటెండెంట్ వెల్లడించారు. తొలి ఐవీఎఫ్ బిడ్డ జననంతో గాంధీ ఆస్పత్రి వర్గాల్లో పండుగ వాతావరణం నెలకొంది. ప్రైవేట్ ఫెర్టిలిటీ సెంటర్లలో లక్షలాది రూపాయలు ఖర్చయ్యే ఈ చికిత్సను ఇక్కడ పూర్తి ఉచితంగా అందించారు. ఖరీదైన సంతాన సాఫల్య చికిత్సను నిరుపేదలకు ఉచితంగా అందించాలనే ప్రభుత్వ లక్ష్యం ఈ విజయంతో నెరవేరింది. ఆర్థిక స్థోమత లేక సంతాన సాఫల్య చికిత్సకు దూరమవుతున్న వేలాది మంది దంపతులకు ఈ విజయం కొత్త ఆశలను చిగురింపజేసింది. ప్రభుత్వ రంగంలో ఇటువంటి అత్యాధునిక చికిత్స విజయవంతం కావడం రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ సాధించిన పెద్ద విజయంగా భావిస్తున్నారు. గాంధీ ఆస్పత్రిలోని ఈ సెంటర్లో సుమారు రూ.5 కోట్ల వ్యయంతో అత్యాధునిక ఎంబ్రియాలజీ ల్యాబ్, అడ్వాన్స్డ్ ఓటీలను ప్రభుత్వం అందుబాటులోకి తెచ్చింది.

## యూట్యూబర్ కోమలి ఆత్మహత్య

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): హైదరాబాద్లో విషాదం చోటుచేసుకుంది. యూట్యూబర్గా గుర్తింపు పొందిన కోమలి (21) ఆత్మహత్య చేసుకున్నారు. మణికొండలోని చిత్రపురి కాలనీలో ఉన్న తన మేనమామ ఇంట్లో ఫ్యాన్కు ఉరివేసుకుని ఆమె బలవన్మరణానికి పాల్పడ్డారు. ప్రేమ విఫలమవ్వడంతోనే ఆమె ఈ తీవ్ర నిర్ణయం తీసుకున్నట్లు ప్రాథమికంగా తెలుస్తోంది. వివరాల్లోకి వెళితే, విశాఖపట్నంకు చెందిన కోమలి, మల్లారెడ్డి యూనివర్సిటీలో బీఎస్సీ చదువుతూనే యూట్యూబ్ వీడియోలు చేస్తూ మంచి ఫాలోయింగ్ సంపాదించుకున్నారు. గత మూడేళ్లుగా మరో యూట్యూబర్, సాఫ్ట్వేర్ ఉద్యోగి అయిన అఖిల్ రెడ్డితో ఆమె ప్రేమలో ఉన్నట్లు సమాచారం. సుమారు ఏడాది క్రితం వీరిద్దరూ విడిపోయారు. ఈ క్రమంలో తీవ్ర మనోవేదనకు గురైన కోమలి, కొన్ని నెలల క్రితం కూడా ఆత్మహత్యకు యత్నించినట్లు కుటుంబ సభ్యులు చెబుతున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చీరతో ఫ్యాన్కు ఉరివేసుకోగా, కుటుంబ సభ్యులు గమనించి వెంటనే ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ ఆమె మృతి చెందారు. సమాచారం అందుకున్న రాయదుర్గం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆసుపత్రికి తరలించారు. అఖిల్ రెడ్డిని విచారించేందుకు పోలీసులు సిద్ధమవుతున్నారు. తన బాయ్‌ఫ్రెండ్‌తో తిరిగి కలవాలని కోరుకుంటూ తిరుమలకు కాలినడకన వెళ్లిన వీడియోను కోమలి చివరిసారిగా పోస్ట్ చేసినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో ఆమె అభిమానులు, కుటుంబ సభ్యులు శోకసంద్రంలో మునిగిపోయారు.

# గ్రేటర్‌పై గులాబీ గురి!

**జీహెచ్ఎంసీఎన్నికలపై బీఆర్ఎస్ ఫోకస్**

**గ్రౌండ్ వర్క్ షురూ.. పక్కాగా రూట్ మ్యాప్!**




హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): గత అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీవేవ్‌లోనూ జీహెచ్ఎంసీ పరిధిలో బీఆర్ఎస్ పార్టీ తన సత్తా చాటింది. గత ఎన్నికల్లో గెలుపొందిన రెండు అసెంబ్లీ స్థానాలను సైతం బీఆర్ఎస్ కోల్పోయింది. అయితే రాబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లో మాత్రం గెలుపొందాలని గట్టిగా భావిస్తోంది. జీహెచ్ఎంసీ పరిధిలో కొత్తగా ఏర్పాటైన సైబరాబాద్, మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో సత్తాచాటాలని భావిస్తోంది గులాబీదళం. ఈ మేరకు ఇప్పటి నుంచే గ్రౌండ్ వర్క్ ప్రిపేర్ చేస్తోంది అని తెలుస్తోంది. 2023 ఎన్నికల్లో అధికారం కోల్పోయిన బీఆర్ఎస్ పార్టీ అనంతరం జరిగిన ఎన్నికల్లో ఉనికిని కాపాడుకుంది. పంచాయతీ ఎన్నికల్లో అధికార కాంగ్రెస్ పార్టీతో ఢీ అంటే ఢీ అంది. అధికార కాంగ్రెస్ పార్టీ అత్యధిక స్థానాల్లో గెలుపొందినప్పటికీ బీఆర్ఎస్ సైతం తమ ఉనికిని కాపాడుకుంది. ఆ పార్టీ ఊహించిన స్థానాలను అయితే దక్కించుకుంది అని పార్టీ నేతలు చెప్తున్న సంగతి తెలిసిందే. మరోవైపు పురపోరులో కూడా తమ సత్తాచాటింది. మున్సిపల్, కార్పొరేషన్ ఎన్నికల్లోనూ బీఆర్ఎస్ తమ సత్తా చాటింది. అంటే పల్లెపోరులో ఇటు పురపోరులోనూ బీఆర్ఎస్ పరువుకాపాడుకుంది. తాజాగా త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికలపై బీఆర్ఎస్ ఫుల్ ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ పార్టీకి జీహెచ్ఎంసీ కంచుకోట అని చెప్పాలి. 2023 అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్రమంతా కాంగ్రెస్ గాలి వీచినప్పటికీ గ్రేటర్ హైదరాబాద్‌లో మాత్రం కారు దూకుండు ముందు నిలబడ లేకపోయింది. కాంగ్రెస్ వేవ్‌లో కూడా అత్యధిక సీట్లు గెలుచుకుంది బీఆర్ఎస్. జీహెచ్ఎంసీ పరిధిలో 24 అసెంబ్లీ స్థానాలు ఉంటే ఏకంగా 15 స్థానాల్లో బీఆర్ఎస్ విజయకేతనం ఎగురవేసింది. అయితే అసెంబ్లీ ఎన్నికల్లో గ్రేటర్ పరిధిలో సత్తా చాటిన బీఆర్ఎస్ అనంతరం జరిగిన ఉప ఎన్నికల్లో రెండు సిట్టింగ్ స్థానాలను కోల్పోయింది. కంటోన్మెంట్, జూబ్లీహిల్స్ అసెంబ్లీ నియోజకవర్గాలకు జరిగిన ఉప ఎన్నికల్లో అధికార పార్టీ విజయకేతనం ఎగురవేసింది. మరోవైపు ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ బీఆర్ఎస్ పార్టీని వీడి కాంగ్రెస్ పార్టీలో చేరిన సంగతి తెలిసిందే. దీంతో గ్రేటర్ పరిధిలో ప్రస్తుత బీఆర్ఎస్ ఎమ్మెల్యేల సంఖ్య 12కి పడిపోయింది. అయినప్పటికీ జీహెచ్ఎంసీ పరిధిలో కారు జోరు బాగానే ఉంటుంది అని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. తెలంగాణకు గుండె లాంటి గ్రేటర్ హైదరాబాద్‌లో తమ సత్తా చాటాలని నిర్ణయించింది. కొత్తగా ఏర్పడిన సైబరాబాద్, మల్కాజ్ గిరి మున్సిపల్ కార్పొరేషన్ తమ సత్తా చాటాలని బీఆర్ఎస్ పక్కా వ్యూహంతో అడుగులు వేస్తోంది.

**హ్యాట్రిక్ విజయంపై బీఆర్ఎస్ ఫోకస్**

ఇక 2016లో జరిగిన గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఎన్నికల్లో బీఆర్ఎస్ దూకుడు ప్రదర్శించింది. ఆ ఎన్నికల్లో 150 డివిజన్లకు గాను బీఆర్ఎస్ 99 డివిజన్లలో గెలుపొంది రికార్డు నెలకొల్పింది. అదే 2020 వచ్చేసరికి 56 కార్పొరేట్ సీట్లను సొంతం చేసుకుని ఎంఐఎంతో కలిసి మేయర్ సీటును కైవసం చేసుకుంది. అయితే త్వరలో జరగబోయే జీహెచ్ఎంసీ ఎన్నికల్లోనూ విజయం తమనే వరిస్తుంది అని బీఆర్ఎస్ భావిస్తోంది. ఈ మూడు కార్పొరేషన్లకు ఎప్పుడు ఎన్నికలు వచ్చినా గెలుపు బీఆర్ఎస్ దే అన్నట్లుగా ప్రతీ ఒక్కరిని సిద్ధం చేయాలని బీఆర్ఎస్ భావిస్తున్నట్లు తెలుస్తోంది. గ్రేటర్ హైదరాబాద్‌పై పట్టు కోల్పోతే మళ్లీ అధికారంలోకి రావడం కష్టమని బీఆర్ఎస్ భావిస్తోంది. ప్రస్తుతం ఉన్న ఎమ్మెల్యేలలో 15 మంది ఎమ్మెల్యేలు జీహెచ్ఎంసీ పరిధిలో గెలుపొందిన ఎమ్మెల్యేలే కావడం విశేషం. అందుకే ఈ ఉమ్మడి జీహెచ్ఎంసీలో పట్టుకోల్పోకూడదనే లక్ష్యంతో బీఆర్ఎస్ అడుగులు వేస్తోంది. ఇప్పటికే గులాబీ బాస్ ఎన్నికలు ఎప్పుడు వచ్చినా అందుకు సిద్ధంగా ఉండాలని నేతలకు స్పష్టం చేసినట్లు తెలుస్తోంది. ఎక్కడిక్కడ లీడర్లను అలర్ట్ చేసి ఎమ్మెల్యేలు, నియోజకవర్గాల ఇన్‌చార్జిలను అప్రమత్తం చేసి రెగ్యులర్‌గా ఫీల్డ్‌లోనే ఉండాలని సూచించినట్లు తెలుస్తోంది. అంతేకాదు మరో వారం, పది రోజుల్లో ఇన్‌చార్జిలను సైతం ప్రకటించే ఛాన్స్ ఉందని బీఆర్ఎస్ వర్గాల నుంచి సమాచార అందుతోంది.

# సాగునీటి విప్లవం తెచ్చాం

**ఎన్నికల నాటికి ప్రాజెక్టుకు పూర్తి చేస్తాం.. నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్**




వికారాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): తెలంగాణా రాష్ట్ర ఏర్పాటు ఏఐసీసీ అగ్రనేత సోనియాగాంధీ చలువతోటే జరిగిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పేర్కొన్నారు. ఆమె మార్గదర్శనంలోనే కేంద్రంలో నాడు అధికారంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తెలంగాణా రాష్ట్రాన్ని ఏర్పాటు చేసిందని ఆయన తేల్చిచెప్పారు. వికారాబాద్‌లో జరుగుతున్నకాంగ్రెస్ పార్టీ శిక్షణా తరగతులలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన సభలో మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఉపాధిహామీ పథకంతో పాటు సమాచార హక్కు చట్టం సోనియాగాంధీ మానస పుత్రికలుగా అభివర్ణించారు. యూపీఏ చైర్మన్ హోదాలో ఆమె మార్గదర్శనంలో రూపు దిద్దుకున్న ఈ రెండు చట్టాలు కోట్లాది మందికి శక్తి నిచ్చాయని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక సాగునీటి విప్లవం మొదలైందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖామంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. అందులో భాగంగానే వచ్చే అసెంబ్లీ ఎన్నికలకు ముందే పెండింగ్‌లో ఉన్న ఎస్ఎల్‌బీసీ పాలమూరు–రంగారెడ్డి, కల్వకుర్తి, నెట్టెంపాడు, కోయిలసాగర్, భీమా లతో పాటు డిసెంబర్, 2027 నాటికి దేవాదుల పూర్తి చేస్తామని ఆయన ప్రకటించారు. ఎస్ఎల్‌బీసీ పూర్తి చేసి నల్లగొండ జిల్లాలో 3 లక్షల ఎకరాలకు సాగునీరు సురక్షితమైన త్రాగునీరు అందిస్తామని మంత్రి అన్నారు. అదే విధంగా దేవాదుల పూర్తి చేసి 6.8 లక్షల ఎకరాలకు సాగునీరు తో పాటు వరంగల్ నగరానికి సాగునీరు అందిస్తామని అన్నారు. అంతేకాకుండా సీతారామ, సీతమ్మ సాగర్ ప్రాజెక్టుల ద్వారా ఖమ్మం జిల్లాలో 6 లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తామన్నారు. వివాదాస్పద కాళేశ్వరం బ్యారేజ్ లో కొన్ని భాగాలు కూలిపోయిన నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం సమగ్ర సాంకేతిక అధ్యయనం కోసం ఐఐటీ నిపుణుల బృందాన్ని నియమించాం. మరమ్మతులు చేపట్టాలా పునరుద్ధరణ జరపాలా అన్న అంశంపై అధ్యయనం కొనసాగుతోందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తు చేశారు. ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా పేదలకు పంపిణీ చేస్తున్న దొడ్డు బియ్యాన్ని వినియోగించడంలో ప్రజలు అనాసక్తత చూపడంతో పక్క దారి పట్టి పెద్ద ఎత్తున అక్రమాలకు ఆస్కారం ఏర్పడింది అని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి చెప్పారు. పైగా దొడ్డు బియ్యాన్ని బీర్ల కంపెనీలకు కోళ్ల ఫారాలకు విక్రయిస్తుండడంతో కోటాను కోట్ల ప్రజాధనం దుర్వినియోగం జరుగుతుందని ఆయన అన్నారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రజాపంపిణీ వ్యవస్థ ద్వారా సరఫరా అవుతున్న దొడ్డు బియ్యం సరఫరా పై సమగ్రమైన అధ్యయనం జరిపి అర్హులైన నిరుపేదలందరికీ ఉచితంగా నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ లాంటి విప్లవాత్మకమైన కార్యక్రమానికి శ్రీకారం చుట్టిన విషయాన్ని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి గుర్తుచేశారు. తద్వారా రాష్ట్ర వ్యాప్తంగా 3.30 కోట్ల మంది ప్రజలకు ఉచితంగా సన్న బియ్యం అందుతుండడంతో వారి కళ్ళలో వెలుగులు విరజిమ్ముతున్నాయని అన్నారు. వరికొనుగోలుతో పాటు ప్రజాపంపిణీ వ్యవస్థను పారదర్శకంగా రూపుదిద్దినట్లు రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. 2025–26 ఖరీఫ్ సీజన్‌లో యావత్ భారత దేశంలోనే తెలంగాణా రాష్ట్రం రికార్డ్ స్థాయిలో 148 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం దిగుబడి సాధించిందని రాష్ట్ర నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. ధాన్యం కొనుగోలు కోసం 12,500 గ్రామ పంచాయతీలలో 8860 కొనుగోలు కేంద్రాలు ప్రారంభించి 50 లక్షల మంది రైతుల నుండి 72 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేసిన విషయాన్ని ఆయన గుర్తుచేశారు. కొనుగోలు చేసిన 48 గంటల వ్యవధిలోనే రైతుల ఖాతాలో నగదు జమ చేశామని అన్నారు. మద్దతు ధర తో పాటు ప్రభుత్వం సన్నాలకు ప్రకటించిన బోనస్ లను కలుపుకుని రాష్ట్ర ప్రభుత్వం 20 వేల కోట్లు ఖర్చు పెట్టిందన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనపై మంత్రి ఘాటుగా ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ పాలనలో జరిగిన పొరపాట్లన్నింటిని సరిదిద్దే క్రమంలో రాష్ట్ర ప్రభుత్వం నిమగ్నమయి ఉందని పేర్కొన్నారు.



## మీడియా అకాడమీ చైర్మన్‌గా శ్రీనివాస్‌రెడ్డికి పొడిగింపు

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): సీనియర్ పాత్రికేయుడు, తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ కే శ్రీనివాస్‌రెడ్డి పదవీకాలాన్ని మరో రెండేళ్లు పొడిగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. బుధవారం నుంచి ఈ ఉత్తర్వులు అమల్లో ఉంటాయని ప్రభుత్వం పేర్కొంది. రెండేళ్ల క్రితం మీడియా అకాడమీ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన శ్రీనివాస్‌రెడ్డి పదవీకాలం 24, ఫిబ్రవరి 2026తో ముగిసింది. ఈ నేపథ్యంలో ప్రభుత్వం ఆయననే మరో రెండేళ్లు ఆ బాధ్యతల్లో కొనసాగిస్తూ నిర్ణయం తీసుకుంది. నిజానికి కొత్త చైర్మన్ ఎంపికపై అనేక ఊహాగానాలు వెలువడినప్పటికీ.. అంతిమంగా శ్రీనివాస్‌రెడ్డిని కొనసాగించేందుకే సీఎం ఆసక్తి చూపారు.

## డెస్క్ జర్నలిస్టులకు అన్యాయం జరగనివ్వం: సీఎం సీపీఆర్వో మల్సూర్

డెస్క్ జర్నలిస్టుల అక్రిడిటేషన్ల విషయంలో ఎవరూ ఆందోళన చెందవద్దని, అర్హులైన వారెవరికీ అన్యాయం జరగనివ్వబోమని ముఖ్యమంత్రి సీపీఆర్వో డాక్టర్ మల్సూర్ స్పష్టం చేశారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి సూచించిన విధంగా.. గతంలో కంటే ఎక్కువగానే అక్రిడిటేషన్ కార్డులు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు. బుధవారం సచివాలయంలో డెస్క్ జర్నలిస్ట్ ఫెడరేషన్ ఆఫ్ తెలంగాణ (డీజేఎఫ్‌టీ) రాష్ట్ర నాయకులు ఆయన్ను కలిసి వినతిపత్రం అందజేశారు. అక్రిడిటేషన్ల జారీలో ప్రస్తుతం నెలకొన్న గందరగోళాన్ని సంఘం నేతలు సీపీఆర్వో దృష్టికి తీసుకెళ్లారు. డెస్క్ జర్నలిస్టులందరికీ కార్డులు ఇవ్వాలని కోరారు. జిల్లాల వారీగా పనిచేస్తున్న సబ్ ఎడిటర్ల సంఖ్య, గతంలో వారికి ఇచ్చిన కార్డుల వివరాలు, ఎడిషన్ సెంటర్లు, జిల్లా డెస్కుల సమాచారాన్ని ఈ సందర్భంగా వివరించారు. దీనిపై సానుకూలంగా స్పందించిన మల్సూర్... కార్డుల సంఖ్యను తగ్గించవద్దని మంత్రి పొంగులేటి అధికారులకు ఇప్పటికే స్పష్టమైన ఆదేశాలిచ్చారని గుర్తుచేశారు. గతంలో ఎన్ని అక్రిడిటేషన్లు ఇచ్చారన్న జాబితాను తెప్పించి పరిశీలిస్తామని, సమాచార శాఖ మంత్రి, కమిషనర్‌తో మాట్లాడి న్యాయం చేస్తామన్నారు. సీపీఆర్వోను కలిసిన వారిలో డీజేఎఫ్‌టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మస్తాన్, నాయకులు దొడ్డి శేఖర్, ఓగేటి కిరణ్ కుమార్, వినోద్ రావు, భాస్కర్ తదితరులు ఉన్నారు.

## రేవంత్‌తో అడోబ్ సీఈవో భేటీ

**ఉద్యోగాలపై ఏఐ, నైపుణ్యాభివృద్ధి, కొత్త అవకాశాలపై చర్చ**

**ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై సమావేశం**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): అడోబ్ సీఈవో, తెలంగాణ రైజింగ్–2047 విజన్ బోర్డు సభ్యుడు శంతను నారాయణ్ హైదరాబాద్‌లో తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలిశారు. ఉద్యోగాలపై ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) ప్రభావం, నైపుణ్యాభివృద్ధి, తెలంగాణను తయారీ కేంద్రంగా మార్చడం, గ్లోబల్ ట్రెండ్స్, గ్రీన్ ఎనర్జీ, కొత్త అవకాశాలు వంటి అంశాలపై వారు చర్చించారు. ప్రభుత్వపరంగా ఏం చేయాలనే అంశాలపై కూడా వారి మధ్య చర్చ జరిగింది. కృత్రిమ మేధను సమర్థవంతంగా వినియోగించుకునే అంశంపై శంతను నారాయణ్‌తో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చర్చించారు. తెలంగాణను తయారీ కేంద్రంగా నిలబెట్టడానికి కీలక కంపెనీలను ఆకర్షించడానికి కొన్ని చర్యలు తీసుకోవాల్సి ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## హైదరాబాదీ పేదలకు ఉగాది కానుక

**ఇందిరమ్మ ఇళ్లు అందించేలా సర్కార్ ప్రణాళిక**

**ఉగాదిలోగా లబ్ధిదారులకు మంజూరు పత్రాలు?**

**సొంత జాగా ఉంటే ఇల్లు కోసం 5 లక్షల ఆర్థిక సాయం**

హైదరాబాద్, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలోని నిరుపేదలకు రేవంత్ రెడ్డి ప్రభుత్వం శుభవార్త అందించింది. రాష్ట్రవ్యాప్తంగా అమలవుతున్న ఇందిరమ్మ ఇళ్ల పథకాన్ని గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (జీహెచ్ఎంసీ) పరిధిలోనూ ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తోంది. ఉగాది పండగలోపు అర్హులైన లబ్ధిదారులకు ఇళ్ల మంజూరు పత్రాలు అందజేయాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. హైదరాబాద్ పరిధిలోని మూడు కార్పొరేషన్ల నుంచి భారీగా దరఖాస్తులు రావడంతో అధికారులు ఇప్పటికే క్షేత్రస్థాయి సర్వే చేపట్టి లబ్ధిదారుల ఎంపిక ప్రక్రియను వేగవంతం చేశారు. ప్రస్తుతం సొంత స్థలం ఉండి కూడా ఆర్థిక ఇబ్బందుల వల్ల ఇల్లు నిర్మించుకోలేని పేదలకు తొలి విడతలో ప్రాధాన్యం ఇవ్వనున్నారు. వీరికి ఇంటి నిర్మాణానికి ప్రభుత్వం రూ. 5 లక్షల ఆర్థిక సాయం అందిస్తుంది. గ్రేటర్ పరిధిలో సుమారు 12 లక్షల మంది ఇందిరమ్మ ఇళ్ల కోసం దరఖాస్తు చేసుకోగా, ప్రాథమిక పరిశీలనలో 18 వేల మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే, ఈ జాబితాను మరోసారి క్షుణ్ణంగా పరిశీలించి, వారం రోజుల్లో తుది జాబితాను సిద్ధం చేయాలని భావిస్తున్నారు. ఆదాయ పరిమితి, భూ యాజమాన్య పత్రాలు, కుటుంబ పరిస్థితులు వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని లబ్ధిదారులను ఎంపిక చేయనున్నారు. మురికివాడల్లో నివసించే వారి కోసం "ఇందిరమ్మ మోడల్ కాలనీలు" నిర్మించాలని ప్రభుత్వం యోచిస్తోంది. నగరానికి దూరంగా ఇళ్లు కేటాయిస్తే వారి జీవనోపాధి దెబ్బతింటుందనే ఉద్దేశంతో, వారు నివసిస్తున్న ప్రాంతాల్లోనే 5 నుంచి 10 అంతస్తుల భవనాలు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వం భావిస్తోంది. దీనికి అవసరమైన స్థల సేకరణపై మంత్రులు ఇటీవల అధికారులతో చర్చించారు. వీటితో పాటు, నగరంలో ఇప్పటికే సిద్ధంగా ఉన్న 28 వేల డబుల్ బెడ్‌రూం ఇళ్లను కూడా పేదలకు కేటాయించాలని నిర్ణయించారు. గృహలక్ష్మి పథకం లబ్ధిదారులకు కూడా ఈ పథకాన్ని వర్తింపజేయనున్నారు. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా ఇందిరమ్మ ఇళ్ల పథకం అమలు వేగంగా సాగుతోంది. ప్రభుత్వం ఇప్పటివరకు 3 లక్షల ఇళ్లను మంజూరు చేయగా, వారిలో 2.50 లక్షల మంది లబ్ధిదారులు నిర్మాణ పనులను ప్రారంభించారు. వచ్చే నెలాఖరు నాటికి లక్ష ఇళ్లను పూర్తి చేయాలని అధికారులు లక్ష్యంగా పెట్టుకున్నారు.

## బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థిని ఆత్మహత్య

బాసర, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): రాష్ట్రంలోని ప్రతిష్ఠాత్మక విద్యాసంస్థ బాసర ట్రిపుల్ ఐటీలో మరో విషాదం చోటుచేసుకుంది. ఇంజినీరింగ్ మొదటి సంవత్సరం చదువుతున్న ఆర్. వసంత అనే విద్యార్థిని ఆత్మహత్య చేసుకుంది. బాలికల వసతి గృహంలో ఆమె బలవన్మరణానికి పాల్పడినట్టు అధికారులు తెలిపారు. మృతురాలి స్వస్థలం వనపర్తి జిల్లాగా గుర్తించారు. ఈ ఘటన గురించి తెలుసుకున్న ట్రిపుల్ ఐటీ సిబ్బంది, విద్యార్థిని కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అనంతరం మృతదేహాన్ని హుటాహుటిన బైంసా ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే, ఈ ప్రక్రియను అధికారులు గోప్యంగా నిర్వహించడం గమనార్హం. వసంత ఆత్మహత్యకు గల కచ్చితమైన కారణాలు ఇంకా తెలియరాలేదు. ఆమె వ్యక్తిగత కారణాలతో ఈ తీవ్ర నిర్ణయం తీసుకుందా? లేక ఇతర ఒత్తిళ్లు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో పోలీసులు విచారణ చేపట్టే అవకాశం ఉంది. బాసర ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు తరచూ జరగడం తీవ్ర ఆందోళన కలిగిస్తోంది.



## పునర్విక‌కు వెల్లువెత్తిన విరాళాలు

**దాతల నుంచి రూ.10 కోట్లు సేకరణ**

**మిగతా 6 కోట్ల బాధ్యత నాదే: నారా లోకేశ్**

కర్నూలు, ఫిబ్రవరి 25 (ఈవార్తలు: ఎస్ఎంఏ టైప్-1 అనే అరుదైన వ్యాధితో బాధపడుతున్న చిన్నారిరికి ఆంధ్రప్రదేశ్ మంత్రి నారా లోకేశ్ అండగా నిలిచేందుకు ముందుకు వచ్చారు. కర్నూలుకు చెందిన బాలిక పునర్విక ఈ వ్యాధితో బాధపడుతోంది. ఆమె చికిత్స కోసం మరో రూ.6 కోట్లు అవసరమని, ఆ మొత్తం అందేలా చూసే బాధ్యత తనదేనని 'ఎక్స్' వేదికగా హామీ ఇచ్చారు. తన కూతురు పునర్విక ఎస్ఎంఏ టైప్-1 వ్యాధితో బాధపడుతోందని, చికిత్స కోసం రూ.16 కోట్ల ఇంజెక్షన్ ఒక్కటే ఆప్షన్‌గా ఉందని, దాని కోసం తాము అన్ని రకాలుగా ప్రయత్నించి ప్రజల నుంచి, దాతల నుంచి రూ.10 కోట్ల వరకు సేకరించామని, మరో రూ.6 కోట్లు అవసరమని పేర్కొంటూ పునర్విక తండ్రి మంత్రి నారా లోకేశ్‌కు 'ఎక్స్' ద్వారా విజ్ఞప్తి చేశారు. ఈ విజ్ఞప్తిపై నారా లోకేశ్ స్పందించారు. ఎస్ఎంఐ టైప్-1 అనేది అరుదైన వ్యాధి అని, దీనితో కండరాలు బలహీనపడతాయని మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఇలాంటి స్థితిలోనూ పునర్విక పోరాడుతున్న తీరు అభినందనీయమని పేర్కొన్నారు. ఆమె నిజంగా ధైర్యవంతురాలని ప్రశంసించారు. అసాధారణ ధైర్యంతో వ్యాధితో పోరాటం చేస్తోందని అన్నారు. ఆమె ఇంజెక్షన్ కోసం రూ.16 కోట్లు అవసరమని, దాతల నుంచి రూ.10 కోట్లు సమకూరడం ఆనందంగా ఉందని పేర్కొన్నారు. పునర్విక ఇంజెక్షన్ కోసం సహకరించిన ప్రతి ఒక్కరికీ తాను సెల్యూట్ చేస్తున్నానని అన్నారు. ఆమె చికిత్స కోసం మిగిలిన రూ.6 కోట్లు అందేలా చూసే బాధ్యత తనదేనని స్పష్టం చేశారు. సహాయం చేయాలంటూ తన కార్యాలయ 'ఎక్స్' ఖాతాకు అటాచ్ చేశారు. పునర్వికకు సహాయం చేయడానికి మరింతమంది ముందుకు రావాలని కోరారు.



## దేవాలయాలు మన సంస్కృతికి ప్రతీకలు: జగన్

**నందిపల్లి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో జగన్**

కడప, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): కడప జిల్లా వేంపల్లె మండలం నందిపల్లి గ్రామంలోని నందీశ్వర ఆలయంలో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో వైసీపీ అధినేత జగన్ పాల్గొన్నారు. శివ నామస్మరణతో మారుమోగుతున్న ఆలయ ప్రాంగణంలో జగన్ సంప్రదాయ దుస్తులు ధరించి పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య జరిగిన హోమాలు, ప్రత్యేక అభిషేకాల్లో ఆయన భక్తిశ్రద్ధలతో పాలుపంచుకున్నారు. అనంతరం అర్చకులు ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, వేదాశీర్వచనం గావించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతూ... దేవాలయాలు మన భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకలని అన్నారు. "భక్తి మార్గం ద్వారానే సమాజంలో శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరుస్తాయి. గ్రామీణ ప్రాంతాల్లో ఆలయాల పునర్నిర్మాణం జరగడం వల్ల ఆధ్యాత్మిక చైతన్యం మరింత విస్తరిస్తుంది" అని ఆయన పేర్కొన్నారు. నందిపల్లిలో ఈ మహోత్సవాన్ని ఒక పండగలా నిర్వహించడం గ్రామ ప్రజల ఐక్యతకు నిదర్శనమని ఆయన ప్రశంసించారు. కుంభాభిషేక మహోత్సవాన్ని విజయవంతంగా నిర్వహించిన ఆలయ కమిటీ ఛైర్మన్ మారం శ్రీకాంత్ రెడ్డిని, ఇతర సభ్యులను జగన్ ప్రత్యేకంగా అభినందించారు. నందీశ్వర స్వామివారి కృపాకటాక్షాలు ప్రజలందరిపై ఉండాలని, ప్రతి ఒక్కరూ సుఖసంతోషాలతో విరాజిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలతో పాటు భారీ సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

## లండన్‌లో తెలుగు యవకుడి మృతి

కాకినాడ, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లి, ప్రయోజకుడవుతాడనుకున్న ఆ ఇంటి ఆశల దీపం ఆరిపోయింది. లండన్‌లో జరిగిన ఒక ఘోర అగ్నిప్రమాదంలో కాకినాడ జిల్లా పెద్దాపురం నియోజకవర్గ పరిధిలోని కొండయ్యపేటకు చెందిన గొంతి అభిషేక్ (28) మృతి చెందాడు. ఈ వార్తతో ఆ గ్రామంలో ఒక్కసారిగా విషాద ఛాయలు అలుముకున్నాయి. అభిషేక్ తండ్రి ఆస్కారరావు ఆగిరిపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో సీహెచ్‌ఓగా విధులు నిర్వహిస్తున్నారు. తన కుమారుడిని ఉన్నత విద్యావంతుడిగా చూడాలన్న ఆకాంక్షతో మూడేళ్ల క్రితం ఆయన అభిషేక్‌ను ఎంబీఏ చదివేందుకు లండన్ పంపారు. చదువు పూర్తయిన తర్వాత అభిషేక్ అక్కడే ఒక సంస్థలో ఉద్యోగం సంపాదించి స్థిరపడ్డాడు. కేవలం ఆరు నెలల క్రితమే ఆయన స్వస్థలానికి వచ్చి కుటుంబ సభ్యులతో సరదాగా గడిపి వెళ్లాడు. అంతలోనే ఈ ఘోరం జరగడం ఆ కుటుంబాన్ని కోలుకోలేని దెబ్బ తీసింది. అగ్నిప్రమాదం వివరాల్లోకి వెళితే... అభిషేక్ నివసిస్తున్న రెండంతస్తుల భవనంలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. ప్రమాద సమయంలో లోపలే చిక్కుకుపోయిన ఆయన, మంటల తీవ్రతకు ఊపిరాడక ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. మరోవైపు, అభిషేక్ మృతదేహాన్ని వీలైనంత త్వరగా స్వస్థలానికి తీసుకువచ్చేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కుటుంబ సభ్యులు, గ్రామస్తులు కోరుతున్నారు.

## ఏపీలో 2018 గ్రూప్-1 అధికారుల బదిలీ

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): ఏపీలో 2018 గ్రూప్-1 అధికారులను ప్రభుత్వం మూకుమ్మడి బదిలీ చేసింది. 2018 గ్రూప్-1 రిక్రూట్‌మెంట్ వివాదంపై విచారణ కొనసాగుతున్న క్రమంలో ఈ నియామక ప్రక్రియపై కీలక నిర్ణయం తీసుకున్న ఏపీ హైకోర్టు.. 2018 రిక్రూట్‌మెంట్ లోపాలపై విచారణ పూర్తయ్యే వరకు అప్రాధాన్య పోస్టులో ఉంచాలంటూ ఆదేశించింది. హైకోర్టు ఆదేశాలతో 26 మందిని సాధారణ పరిపాలన శాఖకి సీఎస్ అటాచ్ చేశారు. ఈ నియామకాల్లోని అధికారులకు కీలక బాధ్యతలు అప్పగించవద్దంటూ హైకోర్టు స్పష్టం చేసింది. హైకోర్టు ఆదేశాలతో సీఎస్.. ప్రస్తుతం విధుల్లో ఉన్న 26 మంది అధికారులను వారి ప్రస్తుత బాధ్యతల నుంచి తప్పించి.. జీఏడీకి అటాచ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

## ప్రియుడి మోజులో 9 నెలల బిడ్డ సమాధి

తిరుపతి, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): తిరుపతిలోని పోస్టల్ కాలనీకి చెందిన ఆశాలత (19) అనే యువతి తన 9 నెలల బిడ్డను హత్యచేసి, దేహాన్ని స్వర్ణముఖి నది సమీపంలో పూడ్చి పెట్టిన ఘటన వెలుగులోకి వచ్చింది. ఆశాలతకి గతంలో వివాహం అవ్వగా భర్తతో గొడవలు మొదలయ్యాయి. దీంతో భర్త నుండి విడిపోయి కొంతకాలం తన తల్లి వద్దే ఉంది. అయితే ఈ క్రమంలో ఆమెకు ఏర్పేడు మండలం చెన్నంపల్లికి చెందిన ఓ వ్యక్తితో పరిచయం ఏర్పడింది. ఆ ఇద్దరూ సహజీవనంలో ఉంటూ పెళ్లి చేసుకోవాలని సైతం నిర్ణయించుకున్నారు. అయితే తమ పెళ్లికి చిన్నారి అడ్డుగా ఉందని కన్నతల్లే హత్య చేసింది.



## నవోదయ విద్యాలయం కోసం స్థల పరిశీలన

**కోరుట్లలో స్థలాన్ని పరిశీలించిన బీఎస్ లత**

కోరుట్ల, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): జగిత్యాల జిల్లాకు కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన జవహర్ నవోదయ విద్యాలయం కోసం జిల్లా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) బీఎస్ లత స్థలాన్ని పరిశీలించారు. భూమి విస్తీర్ణం, సరిహద్దులు, రహదారులు, మౌలిక సదుపాయాలపై అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులకు అనుకూలమైన వాతావరణం కల్పించే విధంగా స్థలం ఎంపిక కావాలని సూచించారు. అన్ని శాఖల సమన్వయంతో అవసరమైన నివేదికలు సిద్ధం చేయాలని ఆదేశించారు. భూమికి సంబంధించిన రికార్డులను పరిశీలించి ఎలాంటి వివాదాలు లేకుండా చూడాలని రెవెన్యూ అధికారులకు తెలిపారు. తాగునీరు, విద్యుత్తు, రహదారి సదుపాయాలు సమృద్ధిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. జవహర్ నవోదయ విద్యాలయం ఏర్పాటుతో ప్రాంతీయ విద్యార్థులకు నాణ్యమైన విద్య అందుబాటులోకి వస్తుందని తెలిపారు. పనులను వేగవంతంగా పూర్తి చేసి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు పంపించాలని ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం అన్ని ప్రక్రియలు పారదర్శకంగా నిర్వహించాలని స్పష్టం చేశారు. కార్యక్రమంలో కోరుట్ల ఆర్డీవో జీవాకర్ రెడ్డి, తహసీల్దార్ కృష్ణ చైతన్య, డిప్యూటీ తహసీల్దార్ ఫరూక్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రాజ్యసభ రేసులో జీవన్ రెడ్డి?

**వీహెచ్, మధుయాష్కీ కూడా.. రెండు సీట్లూ కాంగ్రెస్ ఖాతాలోకే?.. పోటీ ఇచ్చే దిశగా బీఆర్ఎస్ పావులు!**

జగిత్యాల బ్యూరో, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): తెలంగాణ నుంచి 2 రాజ్యసభ స్థానాలు ఖాళీ కాబోతున్నాయి. ఇప్పటికే ఎన్నికల షెడ్యూల్ కూడా జారీ అయింది. అయితే ఈ స్థానాల కోసం కాంగ్రెస్ పార్టీ నుంచి పలువురు సీనియర్ నేతలు ప్రయత్నాలు చేస్తున్నారు. ఈ రెండు స్థానాలకు దక్కించుకునేందుకు టీ కాంగ్రెస్ పావులు కదుపుతోంది. సంఖ్యాబలం పరంగా రెండు సీట్లు కూడా వారి ఖాతాలోకి వెళ్లటం ఖాయంగా కనిపిస్తోంది. ఒక వేళ బీఆర్ఎస్ బరిలో ఉంటే.. ఏమైనా సమీకరణాలు మారుతాయా అనే చర్చ కూడా మొదలైంది. తెలంగాణ నుంచి రాజ్యసభ ఎంపీలుగా ఉన్న అభిషేక్ సింఘ్వీ(కాంగ్రెస్), కేఆర్ సురేశ్ రెడ్డి (బీఆర్ఎస్ ) పదవీకాలం పూర్తి కానుంది. ఏప్రిల్ 9వ తేదీతో ముగుస్తుంది. దీంతో ఈ రెండు స్థానాలకు ఎన్నికలు జరుగుతాయి. అయితే ఈ 2 సీట్లు దాదాపుగా కాంగ్రెస్ కే దక్కే అవకాశం ఉంది. ఈ నేపథ్యంలో రాజ్యసభ సీటు దక్కించునేందుకు పలువురు సీనియర్ నేతలు పావులు కదిపే పనిలో పడ్డారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత కొంత మంది సీనియర్లకు ఎలాంటి అవకాశం రాలేదు. ప్రభుత్వం ఏర్పాటు తర్వాత రాజ్యసభ, ఎమ్మెల్సీతో పాటు నామినేటెడ్ పదవుల భర్తీ జరిగినప్పటికీ కొంతమంది లీడర్లకు చాన్స్ దక్కలేదు. అయితే అలాంటి వారంతా ఇప్పుడు రాజ్యసభ సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. పార్టీలో అత్యంత సీనియర్ నేతగా వీహెచ్ కూడా రాజ్యసభ సీటుపై ఆశలు పెంచుకున్నట్లు తెలుస్తోంది. బీసీ సామాజికవర్గంతో పాటు సీనియార్టీని పరిగణనలోకి తీసుకోవాలని ఆయన కోరుతున్నారు. మరో సీనియర్ నేత మధుయాష్కీ గౌడ్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో ఓటమి పాలైన తర్వాత... ఆయనకు ఎలాంటి అవకాశం రాలేదు. దీంతో రాజ్యసభ సీటును ఆశిస్తున్నట్లు తెలుస్తోంది. ఇక ఎస్టీ కోటాలో బెల్లయ్య నాయక్ కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. కమ్మ సామాజిక వర్గం కోటాలో జెట్టి కుసుమ కుమార్ పేరు తెరపైకి వస్తోంది. ఆయన తప్పకుండా అవకాశం ఇవ్వాలని ఇటీవలే జగ్గారెడ్డి కూడా ప్రతిపాదించారు. ఆయనకు కుదరకపోతే.. వీహెచ్ పేరును పరిగణనలోకి తీసుకోవాలని కోరుతున్నారు. మరోవైపు సీనియర్ నేత కోదండ రెడ్డి కూడా రాజ్యసభ రేసులో ఉన్నారు. ఇదిలా ఉంటే ప్రభుత్వంలో కీలకంగా ఉన్న వేం నరేందర్ రెడ్డి (ప్రభుత్వ సలహాదారు) పేరు కూడా తెరపైకి వస్తోంది. గతంలో కూడా ఆయన పేరు తెరపైకి వచ్చినప్పటికీ వర్కౌట్ కాలేదు. ఇక సీనియర్ నేతలుగా పేరొందిన టి జీవన్ రెడ్డి, చిన్నారెడ్డి పేర్లు కూడా రేసులో ఉన్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం ప్రభుత్వ సలహాదారులుగా ఉన్న హర్కర వేణుగోపాల్, షబ్బీర్ అలీ కూడా సీటు కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ రెండు స్థానాలకు జరిగే ఎన్నిక ఏకగ్రీవం అవుతుందా లేక పోటీ ఉంటుందా అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది. కాంగ్రెస్‌కు ఒక స్థానం గెలుచుకునే బలం ఉంది. రెండో స్థానానికి ఇతరుల మద్దతు అవసరపడుతుంది. ఇక బీఆర్ఎస్ కూడా అభ్యర్థిని బరిలో దించితే సమీకరణాలు మారే అవకాశం ఉంటుంది. ఎనిమిది మంది ఎమ్మెల్యేలున్నా బీజేపీ ఏ పార్టీకీ మద్దతు ఇచ్చే అవకాశం లేదు. ఇక సీపీఐ, ఎంఐఎం, కాంగ్రెస్ వైపే మొగ్గు చూపే అవకాశం ఉంటుంది. సంఖ్యా బలం పరంగా బీఆర్ఎస్ అభ్యర్థిని పెట్టకుండా ఉంటే కాంగ్రెస్ ఖాతాలోకే ఈ రెండు సీట్లు వెళ్తాయి. ఇలా జరిగితే ఎన్నిక లేకుండానే ఏకగ్రీవమయ్యే అవకాశం ఉంటుంది.



**రాజ్యసభ ఎన్నికల వివరాలు:**

నోటిఫికేషన్ - 26 ఫిబ్రవరి 2026.
నామినేషన్లకు చివరి తేదీ - 5 మార్చి 2026.
నామినేషన్ల పరిశీలన - 6 మార్చి 2026.
ఉపసంహరణకు చివరి తేదీ - 9 మార్చి 2026.
పోలింగ్ తేదీ - 16 మార్చి(సోమవారం).
పోలింగ్ సమయం - ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు.
ఓట్ల లెక్కింపు - 16 మార్చి 2026.
ఎన్నికల ప్రక్రియ పూర్తి - 20 మార్చి 2026

# నన్ను ఇబ్బందిపెట్టేందుకే సస్పెన్షన్ పొడిగింపు

**సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్**

విజయవాడ, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): రిటైర్మెంట్ వరకు తన సస్పెన్షన్‌ను ఏపీ ప్రభుత్వం పొడిగించడంపై సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ ఘాటుగా స్పందించారు. గత రెండు సంవత్సరాలుగా తనను ఏదో ఒక రకంగా ఇబ్బందులకు గురి చేయాలని విశ్వప్రయత్నాలు జరుగుతున్నాయని అందులో భాగమే ఈ సస్పెన్షన్ వేటు అని అన్నారు. ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కస్టోడియల్ టార్చర్ కేసు అనేది ఒక పనికిమాలిన కేసుగా అభిప్రాయపడ్డారు. రఘురామ కృష్ణంరాజుపై అసలు కస్టోడియల్ టార్చర్ అనేది జరగలేదు అని చెప్పుకొచ్చారు. మెడికల్ రిపోర్ట్స్ సైతం అదే నిర్ధారించాయని చెప్పుకొచ్చారు. మరోవైపు ఈ కస్టోడియల్ టార్చర్ కేసులో తనను ఏం చేయలేరని భావించి తనను మరో కేసులో ఇరికించారని అన్నారు. తాను అనుమతులు తీసుకునే విదేశాలకు వెళ్లినప్పటికీ తనను సస్పెండ్ చేశారని సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ వెల్లడించారు. కస్టోడియల్ టార్చర్ కేసు అనేది అసలు కేసే కాదు అని సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ చెప్పుకొచ్చారు. జరగనిది జరిగినట్లు ఎలా కేసుపెడతారని ప్రశ్నించారు. తనపై కస్టోడియల్ టార్చర్ జరిగింది సీబీఐతో విచారణ జరిపించాలని ప్రస్తుత అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు కోరితే సుప్రీంకోర్టు అవతలికి పొమ్మంది అని గుర్తు చేశారు. అలాంటి కేసు ఇది అని అభివర్ణించారు. ఆ తర్వాత ఏపీలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో తనపై ఫిర్యాదు చేశారని చేసిన వెంటనే కూడా కేసు నమోదు చేయలేదని అన్నారు. ఫిర్యాదు చేసిన తర్వాత తనపై కేసు నమోదు అయ్యిందని అది కూడా తీవ్రంగా ఒత్తిడి పెంచడంతోనే జరిగింది అని పీవీ సునీల్ కుమార్ చెప్పుకొచ్చారు. తప్పుడు కేసు అయినప్పటికీ తనపై అన్యాయంగా కేసు నమోదు చేశారని వాపోయారు. అయితే ఈ కేసు ఒక పనికిమాలిన కేసు కాబట్టి తనపై చర్యలు ఉంటాయో లేదో అని భావించి ముందస్తు జాగ్రత్తగా తనపై మరో అలిగేషన్ తీసుకువచ్చారని చెప్పుకొచ్చారు. తాను ఎలాంటి అనుమతులు తీసుకోకుండా విదేశాల్లో పర్యటించానని ఒక తప్పుడు ఆరోపణలు చేసి తనను సస్పెండ్ చేశారని అన్నారు. అయితే తాము ఆర్టీఐ యాక్ట్ ప్రకారం ఈ అంశంపై వివరణ కోరితే 10 మందికి పైగా అధికారులు అనుమతులు లేకుండా విదేశాలకు వెళ్లినట్లు తమ దృష్టికి వచ్చిదని సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ తెలిపారు. నిబంధనలకు విరుద్ధంగా తాను విదేశాల్లో పర్యటించానంటూ చేస్తున్న ఆరోపణలు పచ్చి అబద్ధం అని సీఐడీ మాజీ చీఫ్ పీవీ సునీల్ కుమార్ తెలిపారు. తాను అనుమతులు తీసుకునే విదేశాల్లో పర్యటించానని చెప్పుకొచ్చారు. ఆ తర్వాతనే తన షెడ్యూల్‌లో మార్పులు చేర్పులు జరిగాయని అన్నారు. అంతేకాదు సెలవు తీసుకునే విదేశాల్లో పర్యటించానని చెప్పుకొచ్చారు. అన్ని పర్మిషన్లు తీసుకున్న తనను నన్ను సస్పెండ్ చేసి ఎలాంటి అనుమతులు లేకుండా విదేశాల్లో పర్యటించిన వారిని వదిలేశారని అన్నారు. పెత్తందారీ కులాలకు చెందిన అధికారులు ఎలాంటి తాడు బొంగరం లేకుండా అంటే పర్మిషన్లు తీసుకోకుండా విదేశాలకు వెళ్తే వారిపై ఎలాంటి చర్యలు లేవు అని అన్నారు. వారందరినీ వదిలేసి తనపైనే ఎందుకు సస్పెన్షన్ వేటు వేశారో అనేది ప్రశ్నార్థకంగా ఉందని అన్నారు. దీన్ని బట్టే రాష్ట్రంలో సామాజిక న్యాయం అనేది ఎలా అమలవుతుందో అర్థమవుతుంది అని పీవీ సునీల్ కుమార్ చెప్పుకొచ్చారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజుపై ఎలాంటి కస్టోడియల్ టార్చర్ జరగలేదు. మెడికల్ రిపోర్టులు క్లియర్‌గానే ఉన్నాయి. అసలు టార్చరే జరగలేదు. జరగనిది జరగాలని ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌పై ఒత్తిడి చేస్తున్నారని ఆరోపించారు. కస్టోడియల్ టార్చర్ జరిగిందని అందులో తన పేరు చెప్పాలని అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు సునీల్ నాయక్‌కు ఫోన్ చేసి ఒత్తిడి పెంచారని సునీల్ కుమార్ ఆరోపించారు. అసలు డిప్యూటీ స్పీకర్ సునీల్ నాయక్‌కు ఫోన్ చేయాల్సిన అవసరం ఏముందని ఆయనేమైనా దర్యాప్తు అధికారా? అని ప్రశ్నించారు. సాక్ష్యులను ప్రభావితం చేస్తానని తనను సస్పెండ్ చేశారని మరి డిప్యూటీ స్పీకర్‌గా రఘురామకృష్ణంరాజు చేస్తున్నదేమిటి అని ప్రశ్నించారు. రఘురామ కృష్ణంరాజు డిప్యూటీ స్పీకర్ అయితే సాక్ష్యులను ప్రభావితం చేస్తారని తాను ముందు నుంచే చెప్తున్నానని ఇప్పుడు అదే జరుగుతుంది అని సీఐడీ మాజీ చీఫ్ వీ సునీల్ కుమార్ అన్నారు.



## ఏపీలో కొత్తగా 11 డయాలసిస్ కేంద్రాలు

అమరావతి, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): పేద కిడ్నీ రోగుల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని కూటమి ప్రభుత్వం ఉచిత డయాలసిస్ సేవలను విస్తృతం చేస్తోందని రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. శాసనమండలిలో బుధవారం సభ్యులు అడిగిన ప్రశ్నలకు మంత్రి సత్యకుమార్ సమాధానమిస్తూ 76 ప్రభుత్వాసుపత్రులు, ఎన్టీఆర్ వైద్య సేవా ట్రస్టు ఆధ్వర్యంలోని 176 అనుబంధ ఆసుపత్రుల్లో కలిపి 2,721 యంత్రాల ద్వారా 21,504 మంది రోగులు ఉచితంగా డయాలసిస్ సేవలు పొందుతున్నారని తెలిపారు. గడిచిన 20 నెలల్లో సెకండరీ ఆసుపత్రుల్లో కొత్తగా 14 డయాలసిస్ కేంద్రాలను కూటమి ప్రభుత్వం ప్రారంభించిందని పేర్కొన్నారు. అంతేకాకుండా కిడ్నీ రోగులకు మరింత సౌకర్యంగా ఉండేందుకు సెకండరీ ఆసుపత్రుల్లోనే కొత్తగా మరో 11 ఉచిత డయాలసిస్ కేంద్రాలను అందుబాటులోనికి తీసుకురాబోతున్నామని వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ వెల్లడించారు. గత ప్రభుత్వ హయాంలో 47 సెకండరీ ఆసుపత్రుల్లో 555 యంత్రాలు మాత్రమే ఉన్నాయని తెలిపారు. కూటమి ప్రభుత్వం రోగుల అవసరాలను దృష్టిలో పెట్టుకుని వీటి సంఖ్యను అదనంగా 161కు పెంచిందని తెలిపారు. కూటమి ప్రభుత్వం తీసుకుంటోన్న చర్యలవల్ల సెకండరీ ఆసుపత్రుల్లో డయాలసిస్ పొందే వారి సంఖ్య 75% వరకు పెరిగిందని వెల్లడించారు గతంలో నెలకు 40వేల సెషన్ల ద్వారా మాత్రమే రోగులకు సేవలు అందేవని తెలిపారు. కూటమి ప్రభుత్వ చర్యలతో ప్రస్తుతం సగటున నెలకు 66వేల సెషన్ల ద్వారా రోగులకు ఉచితంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. ఒక్కొక్క రోగికి ఉచితంగా అందించే డయాలసిస్ సేవల కోసం ఏడాదికి సగటున రూ. 86వేల చొప్పున ప్రభుత్వం ఖర్చు పెడుతోందని తెలిపారు. గడిచిన 20 నెలల్లో కూటమి ప్రభుత్వం రూ.224 కోట్ల వరకు ఖర్చుపెట్టిందని వెల్లడించారు. కిడ్నీ రోగులకు అవసరమైన మందులను ఉచితంగా అందిస్తున్నామన్నారు. రోగుల ఆరోగ్య స్థితికి అనుగుణంగా ప్రభుత్వంగా పెన్షన్ కూడా ఇస్తోందని తెలిపారు.


# ఏపీ పునర్నిర్మాణం కోసమే కలిశాం

**అందుకే జనసేన, బీజేపీతో పొత్తు**

**మార్కాపురంలో చంద్రబాబునాయుడు**

మార్కాపురం, ఫిబ్రవరి 25 (ఈవార్తలు): గత వైసీపీ పాలనలో రాష్ట్రం విధ్వంసమైందని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆవేదన వ్యక్తం చేశారు. పునర్నిర్మాణం కోసం గత ఎన్నికల్లో ప్రజల సహకారం కోరానని తెలిపారు. రాష్ట్రం కోసమే జనసేన, బీజేపీతో కలిసి ఎన్డీయే కూటమిగా ఏర్పడి ప్రజల ఆశీస్సులు అందుకున్నామని అన్నారు. గత అసెంబ్లీ ఎన్నికల్లో 94 శాతం స్ట్రైక్ రేటుతో అఖండ విజయం కట్టబెట్టారని ఆనందం వ్యక్తం చేశారు. అరకు నుంచి ఉమ్మడి ప్రకాశం వరకు ఒక్క సీటు కూడా వైసీపీకి రాలేదని అన్నారు. 'మార్కాపురం జిల్లా కళ, వెలిగొండతో జలకళ, హార్టికల్చర్ రైతుల జీవితాల్లో కళకళ' కార్యక్రమంలో ముఖ్యమంత్రి మాట్లాడారు. వేదిక వద్ద ఏర్పాటు చేసిన ర్యాంపుపై కలియతిరుగుతూ ప్రజల హర్షాతిరేకాల మధ్య ఆయన ప్రసంగించారు. వచ్చే ఎన్నికల్లో ప్రకాశం, మార్కాపురం జిల్లా అంతా కూటమిని వంద శాతం గెలిపించాలని కోరారు. 150 కిలోమీటర్లు ప్రయాణించి ఒంగోలుకు వెళ్లాల్సిన ఇబ్బందిని తొలగిస్తూ మార్కాపురం జిల్లాను ఏర్పాటు చేసి మాట నిలబెట్టుకున్నామని అన్నారు. మార్కాపురం జిల్లా మదనపల్లి జిల్లా, అలాగే పోలవరం జిల్లాను కూడా ఏర్పాటు చేశామని అన్నారు. వెనుకబడిన ప్రాంతాలు నీరు, సౌకర్యాలు లేక ఇబ్బందులు పడ్డారని, మార్కాపురానికి మరో వరంగా వెలిగొండ ప్రాజెక్టును పూర్తి చేసి నీరు అందిస్తామని హామీ ఇచ్చారు. గతంలో ఈ ప్రాజెక్టుకు తానే శంకుస్థాపన చేశానని, అదే ప్రాజెక్టు పూర్తి చేయడానికి ఇప్పుడు తనకు అవకాశం వచ్చిందని అన్నారు. 2019-24 మధ్య రాష్ట్రానికి చీకటి రోజులు అని వ్యాఖ్యానించారు. వెలిగొండ ప్రాజెక్టు ఒక్క అడుగు పడలేదని అన్నారు. ఈ ప్రాజెక్టును నిర్మిస్తే 4.35 లక్షల ఎకరాలు సాగులోకి వస్తాయని, గిద్దలూరు, ఎర్రగొండపాలెం, కనిగరి లాంటి నియోజకవర్గాలతో పాటు ఉదయగిరి, కడప, బద్వేలుకు కూడా నీళ్లు వెళ్తాయని అన్నారు. గతంలో తాను ముఖ్యమంత్రిగా కొనసాగి ఉంటే 2021లోనే ప్రాజెక్టు పూర్తి చేసి నీళ్లు ఇచ్చేవాళ్లమని వెల్లడించారు. గత పాలకుడు పనులు పూర్తి అయ్యాయని దొంగ నాటకాలు ఆడారని, పనులు పూర్తి చేయకుండానే జాతికి అంకితం చేశారని విమర్శించారు. నిజంగానే ప్రాజెక్టు పనులు పూర్తి అయి ఉంటే ఇప్పుడు నేను రావాల్సిన అవసరమే ఉండేది కాదని పేర్కొన్నారు. ప్రాజెక్టు పూర్తి చేస్తానని నాలుగు సార్లు సభలు పెట్టి నాలుగు తేదీలు ఇచ్చాడని అన్నారు. ఉత్తుత్తి ప్రాజెక్టుకు రిబ్బన్ కట్ చేసి మోసం చేశాడని మాజీ ముఖ్యమంత్రిపై మండిపడ్డారు. రూ.9081 కోట్ల నిధులు ఈ ప్రాజెక్టుకు అవసరమని, ఇప్పటి వరకు నిర్మాణానికి రూ.5451 కోట్లు ఖర్చు చేశామని వెల్లడించారు. భూసేకరణకు రూ.484 కోట్లు, పునరావాసానికి రూ.184 కోట్లు ఖర్చు చేసినట్లు తెలిపారు. రెండు దశల్లో ఈ ప్రాజెక్టు పూర్తి చేయాలని ప్రణాళిక చేశామని, మరో రూ.2,540 కోట్లు ఖర్చు చేస్తే కానీ వెలిగొండ పనులు పూర్తి కావని అన్నారు. గడచిన 20 నెలల్లో రూ.540 కోట్లు ఖర్చు చేసి పనులు వేగంగా చేపడుతున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు వెల్లడించారు. రూ.456 కోట్లతో విలువైన ఫీడర్ కెనాల్ లైనింగ్ పనులకు శంకుస్థాపన చేసి బహిరంగ సభకు వచ్చానని తెలిపారు. గత పాలకులు ఐదేళ్లలో ఈ ప్రాజెక్టుకు రూ.500 కోట్లు ఖర్చు చేసి పనులు అయిపోయాయని పంగ నామాలు పెట్టారని మండిపడ్డారు. ఎవరు మంచి చేస్తే వారికి అండగా నిలిస్తేనే ప్రజల జీవితాలు మెరుగవుతాయని అన్నారు.





# ఏదైనా అమెరికా కోసమే..!



## కొత్త కీలక చట్టాలు చేద్దాం.. భారీ సంస్కరణలు అవసరం.. కాంగ్రెస్‌కు ట్రంప్ పిలుపు

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. దేశీయంగా పలు కీలక చట్టాలను తీసుకురావాలని కాంగ్రెస్‌పై తీవ్ర ఒత్తిడి తెచ్చారు. తన రెండోసారి అధ్యక్ష పదవిలో భాగంగా తొలిసారి చేసిన 'స్టేట్ ఆఫ్ ది యూనియన్' ప్రసంగంలో సరిహద్దు భద్రత, ఓటర్ ఐడీ, హెల్త్‌కేర్‌తో పాటు పలు అంశాలపై సంచలన ప్రతిపాదనలు చేశారు. రికార్డు స్థాయిలో 1 గంట 47 నిమిషాల పాటు ఆయన ప్రసంగం కొనసాగింది. సరిహద్దు భద్రత, హోంల్యాండ్ సెక్యూరిటీకి సంబంధించిన నిధులను తక్షణమే పూర్తిగా పునరుద్ధరించాలని ట్రంప్ డిమాండ్ చేశారు. నేరస్థులకు రక్షణ కల్పిస్తున్న 'శాంచురీ నగరాల'ను అంతం చేయాలని, అక్రమ వలసదారులను దేశం విడిచి పంపకుండా అడ్డుకుంటున్న అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. అక్రమ వలసదారులకు వాణిజ్య డ్రైవింగ్ లైసెన్సులు జారీ చేయకుండా నిరోధించేందుకు 'డెలీలా చట్టం' తీసుకురావాలని ప్రతిపాదించారు. ఎన్నికల వ్యవస్థపైనా ట్రంప్ కీలక వ్యాఖ్యలు చేశారు. "సేవ్ అమెరికా చట్టం" ద్వారా అక్రమ వలసదారులు ఓటు వేయకుండా ఆపాలని అన్నారు. ఓటు వేయాలంటే ప్రతి ఒక్కరూ ఓటర్ ఐడీ, పౌరసత్వ రుజువు తప్పనిసరిగా చూపించాలని స్పష్టం చేశారు. అనారోగ్యం, వైకల్యం, సైనిక సేవ, ప్రయాణంలో ఉన్నవారు మినహా ఇతరులకు మెయిల్-ఇన్ బ్యాలెట్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. హెల్త్‌కేర్ రంగంలో తాను తెచ్చిన ఔషధ ధరల తగ్గింపు విధానాన్ని చట్టబద్ధం చేయాలని కోరారు. ఇన్సూరెన్స్ కంపెనీలకు చెల్లింపులు ఆపి, ఆ డబ్బును నేరుగా ప్రజలకే ఇవ్వాలని సూచించారు. కాంగ్రెస్ సభ్యులు అంతర్గత సమాచారంతో లాభపడకుండా "స్టాప్ ఇన్‌సైడర్ ట్రేడింగ్ యాక్ట్" తేవాలని, వాల్‌స్ట్రీట్ సంస్థలు పెద్ద ఎత్తున ఇళ్లను కొనుగోలు చేయకుండా శాశ్వత నిషేధం విధించాలని కోరారు. ట్రంప్ ప్రసంగంలోని వలస విధానాలు, వీసాలకు సంబంధించిన అంశాలను భారతీయ వర్గాలు నిశితంగా గమనిస్తున్నాయి. సరిహద్దు భద్రత, డాక్యుమెంటేషన్ నిబంధనలలో మార్పులు జరిగితే అమెరికాలోని భారతీయ విద్యార్థులు, నైపుణ్యం కలిగిన ఉద్యోగులు, ప్రవాస భారతీయులపై ప్రభావం చూపే అవకాశం ఉందని విశ్లేషకులు భావిస్తున్నారు.

## ఐ-ప్యాక్‌తో అఖిలేశ్ ఒప్పందం

**2027 యూపీ ఎన్నికలే టార్గెట్**



లక్నో: ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికలు 2027 ప్రారంభంలో జరగనున్నాయి. కానీ, అప్పుడే ఆ రాష్ట్రంలో ఎన్నికల వేడి మొదలయింది. దేశంలోనే అతిపెద్ద రాష్ట్రమైన యూపీలో అధికారాన్ని కైవసం చేసుకునేందుకు సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేశ్ యాదవ్ భారీ స్కెచ్ వేశారు. వరుసగా రెండు పర్యాయాలు అధికారంలో ఉన్న యోగి ఆదిత్యనాథ్ సర్కార్‌ను గద్దె దించడమే లక్ష్యంగా... దేశంలోనే అత్యంత విజయవంతమైన రాజకీయ వ్యూహకర్తల సంస్థ 'ఐ-ప్యాక్'తో అఖిలేశ్ ఒప్పందం కుదుర్చుకున్నారు. పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ, తమిళనాడు సీఎం ఎం.కె. స్టాలిన్ ఇచ్చిన సూచన మేరకే తాను ఈ నిర్ణయం తీసుకున్నట్లు అఖిలేశ్ యాదవ్ స్పష్టం చేశారు. ఐ-ప్యాక్ వ్యూహాలతోనే బెంగాల్‌లో టీఎంసీ, తమిళనాడులో డీఎంకే విజయాలు సాధించిన నేపథ్యంలో, అదే ఫార్ములాను యూపీలోనూ వర్తింపజేయాలని ఆయన నిర్ణయించారు. పార్టీ ప్రచారాన్ని కేవలం పట్టణాలకే పరిమితం చేయకుండా జిల్లా, బూత్ స్థాయి వరకు బలంగా తీసుకువెళ్లే బాధ్యతను ఐ-ప్యాక్‌కు అప్పగించారు.

## ఏఐకి మేం భయపడం: టీసీఎస్ సీఈవో



కృత్రిమ మేధ (ఏఐ)పై టీసీఎస్ సీఈవో కృతివాసన్ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ఏఐ సాంకేతికతకు టీసీఎస్ భయపడదని వ్యాఖ్యానించారు. ఏఐ వల్ల సంభవించే మార్పులకు అనుగుణంగా కంపెనీ తన విధానాలను మార్చుకుంటోందని వెల్లడించారు. సంస్థ వార్షిక కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ, ఏఐ సాంకేతికత వినియోగంతో స్వీయ ఆదాయం తగ్గినా ఫర్వాలేదని, వీటిని ఉపయోగించాలని సిబ్బందిని ప్రోత్సహిస్తున్నామని అన్నారు. ఏఐ ఆధారిత సాంకేతిక వినియోగంలో యువ నిపుణులతో పోలిస్తే సీనియర్ స్థాయి ఉద్యోగులు నెమ్మదిగా ఉన్నారని తెలిపారు. తమ కంపెనీకి చెందిన ఆరు లక్షల మంది ఉద్యోగులకు ఏఐ నైపుణ్యం ఉండాలని భావిస్తున్నామని అన్నారు. ఉద్యోగులు కూడా అందుకు అనుగుణంగా కష్టపడాలని సూచించారు. ఉపాధి అవకాశాలను నూతన సాంకేతికత దెబ్బతీస్తుందనే అంశంపై టీసీఎస్ భయపడదని తెలిపారు.

## పరీక్ష రాస్తూ ప్రసవం!

**వాష్‌రూంలో బిడ్డకు జన్మనిచ్చిన విద్యార్థిని**

భోపాల్: మధ్యప్రదేశ్‌లో అత్యంత విస్తుపోయే ఘటన చోటుచేసుకుంది. పదో తరగతి బోర్డు పరీక్ష రాస్తున్న ఓ మైనర్ విద్యార్థిని, పరీక్షా కేంద్రంలోని వాష్‌రూంలోనే పండంటి మగబిడ్డకు జన్మనిచ్చింది. ఈ అనూహ్య సంఘటనతో పరీక్షా కేంద్రంలో తీవ్ర కలకలం రేగింది. ధార్ జిల్లాలోని పారిశ్రామిక ప్రాంతమైన పిథాంపూర్‌లో మంగళవారం ఈ ఘటన జరిగింది. వివరాల్లోకి వెళితే... పిథాంపూర్‌లోని ఓ ప్రైవేట్ పాఠశాలలో ఏర్పాటు చేసిన పరీక్షా కేంద్రంలో పదో తరగతి గణితం పేపర్ రాస్తున్న విద్యార్థినికి మధ్యలో తీవ్రమైన కడుపునొప్పి వచ్చింది. ఇన్విజిలేటర్ అనుమతితో ఆమె వాష్‌రూంకు వెళ్లింది. అయితే, చాలాసేపటికీ తిరిగి రాకపోవడంతో పాటు లోపలి నుంచి పసికందు ఏడుపు వినిపించడంతో సిబ్బంది ఆందోళనకు గురయ్యారు. తలుపులు తెరిచి చూడగా, విద్యార్థిని బిడ్డను ప్రసవించి ఉండటం చూసి నిశ్చేష్టులయ్యారు. వెంటనే పరీక్షా కేంద్రం యాజమాన్యం 108 అంబులెన్స్‌కు సమాచారం అందించింది. తల్లీబిడ్డను హుటాహుటిన స్థానిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌కు తరలించారు. ప్రస్తుతం ఇద్దరి ఆరోగ్యం నిలకడగా ఉందని, వైద్యుల పర్యవేక్షణలో ఉన్నారని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి. ఈ ఘటనపై పోలీసులు జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. బాధితురాలు ఇండోర్ జిల్లాలోని బెత్మా ప్రాంతానికి చెందినది కావడంతో కేసును అక్కడి పోలీస్ స్టేషన్‌కు బదిలీ చేసినట్లు ధార్ ఏఎస్పీ విజయ్ దబార్ మీడియాకు వెల్లడించారు. విచారణలో భాగంగా గత రెండేళ్లుగా ఓ యువకుడితో పరిచయం ఉన్నట్లు బాధితురాలు పోలీసులకు తెలిపింది. ఆమె వాంగ్మూలం ఆధారంగా నిందితుడిని గుర్తించామని, త్వరలోనే అతడిని అరెస్ట్ చేస్తామని పోలీసులు పేర్కొన్నారు. నిందితుడిపై పోక్సో సహా సంబంధిత సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

## ట్రంప్ 'సోలార్' బాంబ్

**భారత సోలార్ ఉత్పత్తుల దిగుమతులపై 126% సుంకం**

**ఇండోనేసియా, లావోస్ లపైనా భారీ సుంకాలు**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత వాణిజ్యాన్ని మరోసారి దెబ్బకొట్టారు. మన దేశం నుంచి అమెరికాకు ఎగుమతి అయ్యే సోలార్ సెల్స్, ప్యానెల్స్ పై ఏకంగా 126 శాతం ప్రాథమిక డ్యూటీ విధిస్తూ సంచలన నిర్ణయం తీసుకున్నారు. అమెరికాలో క్లీన్ ఎనర్జీ ధరలు పెరిగినా సరే, చైనా లేదా భారత్ వంటి దేశాల నుంచి దిగుమతులను తగ్గించి, స్థానిక తయారీని పెంచాలన్నదే ట్రంప్ మొండి పట్టుదలగా కనిపిస్తోంది. భారత్ తో పాటు ఇండోనేసియా (86% నుంచి 143%), లావోస్ (81%) దేశాలపై కూడా ట్రంప్ ప్రభుత్వం ఈ భారాన్ని మోపింది. ఈ మూడు దేశాల నుంచి అమెరికాకు సుమారు 4.5 బిలియన్ డాలర్ల విలువైన సోలార్ ఉత్పత్తులు దిగుమతి అవుతున్నాయి. భారత ప్రభుత్వం తన సోలార్ పరిశ్రమలకు అడ్డగోలుగా సబ్సిడీలు ఇస్తోందని, దీనివల్ల అమెరికాలోని స్థానిక కంపెనీలు నష్టపోతున్నాయని వాణిజ్య శాఖ వాదిస్తోంది. అందుకే 'కౌంటర్ వైలింగ్ డ్యూటీ' పేరిట ఈ బాదుడు మొదలుపెట్టింది.

# నకిలీ డిగ్రీతో హైకోర్టు జడ్జిగా ఐదేళ్లు

**పాకిస్థాన్ న్యాయవ్యవస్థలో పెను సంచలనం**

ఇస్లామాబాద్: పాకిస్థాన్ న్యాయవ్యవస్థలో అత్యంత విస్మయకరమైన ఘటన వెలుగుచూసింది. ఏకంగా హైకోర్టు జడ్జిగా బాధ్యతలు నిర్వర్తిస్తున్న వ్యక్తి.. నకిలీ లా డిగ్రీతో ఆ పదవిని దక్కించుకున్నట్లు తేలడం సర్వత్ర చర్చనీయాంశమైంది. ఇస్లామాబాద్ హైకోర్టు జడ్జిగా పనిచేసిన జస్టిస్ తారిక్ మహమూద్ జహంగీరిని పదవి నుంచి తొలగిస్తూ కోర్టు సోమవారం 116 పేజీల సుదీర్ఘ తీర్పును వెలువరించింది. జహంగీరి విద్యార్హతలపై అనుమానాలు రావడంతో విచారణ చేపట్టిన హైకోర్టు ధర్మాసనం.. కరాచీ యూనివర్సిటీ రిజిస్ట్రార్ నుంచి అసలు రికార్డులను తెప్పించింది. ఆ రికార్డుల ప్రకారం.. జహంగీరి 1988లో ఒక నకిలీ ఎన్‌రోల్‌మెంట్ నంబర్‌తో పరీక్షలకు హాజరయ్యారని, అప్పట్లో కాపీ కొడుతూ దొరికిపోవడంతో యూనివర్సిటీ ఆయనపై మూడేళ్ల పాటు నిషేధం విధించిందని వెల్లడైంది. అయితే, ఆ శిక్షను అనుభవించకుండానే, ఆయన తప్పుడు మార్గాల్లో 'ఇంతియాజ్ అహ్మద్' అనే మరో విద్యార్థికి



కేటాయించిన నంబర్‌ను వాడుకుని పట్టా పొందినట్లు కోర్టు నిర్ధారించింది. ఈ వ్యవహారంలో ఇస్లామాబాద్ హైకోర్టు సంచలన వ్యాఖ్యలు చేసింది. జహంగీరి లా డిగ్రీ 'అబ్ ఇనిషియో' (తొలి నుంచీ చెల్లనిది) అని కోర్టు స్పష్టం చేసింది. డిగ్రీయే లేనప్పుడు హైకోర్టు జడ్జిగా ఆయన నియామకం చట్టబద్ధంగా అసాధారణమని పేర్కొంది. తన విద్యార్హతలకు సంబంధించిన అసలు పత్రాలను సమర్పించేందుకు కోర్టు పలుమార్లు అవకాశం ఇచ్చినప్పటికీ, జహంగీరి వాటిని చూపించడంలో విఫలమయ్యారు. దీనికి బదులుగా విచారణను వాయిదా వేయాలని, బెంచ్ మార్చాలని రకరకాల సాకులు చెప్పడంపై కోర్టు ఆగ్రహం వ్యక్తం చేసింది. గవర్నమెంట్ ఇస్లామియా లా కాలేజీ ప్రిన్సిపాల్ కూడా కోర్టులో కీలక సాక్ష్యం చెబుతూ.. తమ సంస్థలో జహంగీరి ఎప్పుడూ అడ్మిషన్ తీసుకోలేదని ధృవీకరించారు. డిసెంబర్ 2020లో హైకోర్టు జడ్జిగా నియమితులైన జహంగీరి, సుమారు ఐదేళ్ల పాటు అనేక కేసుల్లో తీర్పులు ఇచ్చారు. అయితే గత ఏడాది సెప్టెంబర్‌లోనే ఆయన విధులపై స్టే విధించిన కోర్టు, తాజాగా తుది తీర్పుతో ఆయనను పదవి నుంచి శాశ్వతంగా తొలగించింది.

# స్వల్ప లాభాలతో ముగిసిన సూచీలు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు ఇవాళ స్వల్ప లాభాలతో ముగిశాయి. ఉదయం ట్రేడింగ్ ఆరంభంలో మంచి లాభాలతో సానుకూలంగా కనిపించినప్పటికీ ఆ తర్వాత అమ్మకాల ఒత్తిడి పెరగడంతో సూచీలు రోజంతా ఒడిదొడుకులకు లోనయ్యాయి. చివరికి ట్రేడింగ్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 50.15 పాయింట్ల స్వల్ప లాభంతో 82,276.07 వద్ద, నిఫ్టీ 57.85 పాయింట్ల లాభంతో 25,482.50 వద్ద స్థిరపడ్డాయి. మార్కెట్లలోని అస్థిరతకు అధిక స్థాయిల వద్ద మదుపరులు లాభాల స్వీకరణకు మొగ్గు చూపడమే ప్రధాన కారణంగా కనిపిస్తోంది. రిలయన్స్ ఇండస్ట్రీస్, ఎస్‌బీఐ వంటి దిగ్గజ షేర్లలో అమ్మకాల ఒత్తిడి సూచీలపై తీవ్ర భారం మోపింది. మరోవైపు హెచ్‌సీఎల్ టెక్, టీసీఎస్ వంటి ఐటీ షేర్లతో పాటు టాటా స్టీల్ వంటి మెటల్ కంపెనీల షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడంతో మార్కెట్లు నష్టాల్లోకి జారుకోకుండా నిలిచాయి. సెన్సెక్స్‌లో రిలయన్స్ ఇండస్ట్రీస్ షేరు అత్యధికంగా 2.23 శాతం నష్టపోయింది. ఎస్‌బీఐ, భారతీ ఎయిర్‌టెల్, ఐటీసీ, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, బజాజ్ ఫైనాన్స్ షేర్లు కూడా నష్టపోయిన వాటిలో ఉన్నాయి. మరోవైపు



హెచ్‌సీఎల్ టెక్ 2.8 శాతం లాభంతో టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా స్టీల్, టీసీఎస్, ఇండిగో, సన్ ఫార్మా, మహీంద్రా అండ్ మహీంద్రా షేర్లు కూడా లాభాలను నమోదు చేశాయి. ప్రధాన సూచీలతో పోలిస్తే బ్రాడర్ మార్కెట్లు మెరుగైన ప్రదర్శన కనబరిచాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.58 శాతం, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 ఇండెక్స్ 0.96 శాతం చొప్పున లాభపడ్డాయి. రంగాల వారీగా చూస్తే నిఫ్టీ మెటల్ ఇండెక్స్ అత్యధికంగా రాణించగా, నిఫ్టీ ఐటీ, ఫార్మా సూచీలు కూడా లాభాల్లో ముగిశాయి. అయితే, నిఫ్టీ పీఎస్‌యూ బ్యాంక్ ఇండెక్స్ ఈ సెషన్‌లో అత్యధికంగా నష్టపోయింది. మార్కెట్ తీరుపై విశ్లేషకులు స్పందిస్తూ నిఫ్టీకి 25,400 స్థాయి వద్ద తక్షణ మద్దతు ఉందని తెలిపారు. ఒకవేళ సూచీ 25,300 స్థాయికి దిగువన స్థిరపడితే అమ్మకాల ఒత్తిడి మరింత పెరిగి 25,150 స్థాయి వరకు పడిపోయే అవకాశం ఉందని అంచనా వేశారు. మార్కెట్ తిరిగి పుంజుకోవాలంటే, 25,650 వద్ద ఉన్న బలమైన నిరోధాన్ని అధిగమించాల్సి ఉంటుందని వివరించారు.

## 'న్యాయవ్యవస్థలో అవినీతి' పాఠం తొలగిస్తాం: కేంద్రం

న్యూఢిల్లీ: ఎన్‌సీఈఆర్టీ 8వ తరగతి పాఠ్యాంశంలో ప్రవేశపెట్టిన న్యాయవ్యవస్థలోని వివిధ స్థాయిలలో అవినీతి అంశాన్ని తొలగిస్తామని కేంద్ర ప్రభుత్వ వర్గాలు వెల్లడించాయి. ఈ అంశాన్ని పాఠ్యపుస్తకంలో ప్రవేశ పెట్టడంపై భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు కూడా ఆందోళన వ్యక్తం చేసింది. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ వర్గాలు స్పందించాయి. వివాదాస్పద అంశాలను తొలగించాలని నిర్ణయించినట్లు వెల్లడించాయి. ఇలాంటి అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చకుండా ఉండాల్సిందని అభిప్రాయపడ్డాయి. అలాంటి అంశాలను పాఠ్యాంశాల్లో చేర్చడం సముచితం కాదని, స్ఫూర్తిదాయక అంశాలు పొందుపరచవలసి ఉండాల్సిందని ఆ వర్గాలు తెలిపాయి. "ఇది సరైనది కాదు మరియు సముచితం కాదు" అని మాజీ ప్రధాన న్యాయమూర్తి బీఆర్ గవాయ్‌ని ఉటంకిస్తూ వెల్లడించాయి. ప్రస్తుత ప్రధాన న్యాయమూర్తి కూడా దీనిపై అసంతృప్తి వ్యక్తం చేసినట్లు పేర్కొన్నాయి. 8వ తరగతి విద్యార్థులకు న్యాయవ్యవస్థలో అవినీతి గురించి ఎన్‌సీఈఆర్టీ బోధిస్తోందని సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ సుప్రీంకోర్టు దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై అత్యున్నత న్యాయస్థానం అసంతృప్తి వ్యక్తం చేసింది. ఈ పరిణామం అందరినీ కలవరానికి గురి చేసిందని, న్యాయ వ్యవస్థ పటిష్ఠతకు భంగం కలిగించే చర్యలను సహించబోమని సుప్రీంకోర్టు పేర్కొంది.

## రష్యన్ మహిళలతో సంబంధాలు నిజమే: బిల్ గేట్స్



న్యూయార్క్: సంచలనం సృష్టించిన ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణంలో తన పేరు ఉండటంపై మైక్రోసాఫ్ట్ సహవ్యవస్థాపకుడు బిల్ గేట్స్ స్పందించారు. ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు ఉన్నాయని, కానీ ఆయన నేరాల్లో భాగస్వామ్యం కాలేదని స్పష్టం చేశారు. జెఫ్రీ ఎప్‌స్టీన్స్‌తో తనకు సంబంధం ఉండటంపై బిల్ గేట్స్ తన గేట్స్ ఫౌండేషన్ సిబ్బందికి క్షమాపణలు చెప్పారు. తాను చట్టవిరుద్ధంగా ఏ పని చేయలేదని ఆయన స్పష్టం చేశారు. అయితే ఇద్దరు రష్యన్ మహిళలతో సంబంధాలు ఉన్నాయని ఆయన అంగీకరించడం గమనార్హం. నేరాల్లో మాత్రం భాగస్వామ్యం లేదని 'ది వాల్ స్ట్రీట్ జర్నల్' ఇంటర్వ్యూలో ఈ అంశాలను పేర్కొన్నారు. ఎప్‌స్టీన్స్‌తో సంబంధాలు, అతని సమావేశాలలో గేట్స్ ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్‌లు పాల్గొనడం తాను చేసిన తప్పు అని అంగీకరించారు. ఎప్‌స్టీన్ నేరాలు తమ ఫౌండేషన్ విలువలకు, లక్ష్యాలకు వ్యతిరేకమని తెలిపారు. ఎప్‌స్టీన్‌తో సంబంధాలు తమ ప్రతిష్ఠకు సంబంధించిన అంశమని పేర్కొన్నారు.

# భారత్ కోళ్లు, గుడ్లపై సౌదీ బ్యాన్

**మరో 39 దేశాలపైనా నిషేధం**

**బర్డ్ ఫ్లూ తదితర కారణాలతో బ్యాన్**

రియాద్: ప్రజారోగ్యం, ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని గల్ఫ్ దేశం సౌదీ అరేబియా కీలక నిర్ణయం తీసుకుంది. భారత్ సహా ప్రపంచవ్యాప్తంగా ఉన్న 40 దేశాల నుండి కోళ్లు (పౌల్ట్రీ), గుడ్ల దిగుమతిపై సౌదీ ఫుడ్ అండ్ డ్రగ్ అథారిటీ సంపూర్ణ నిషేధం విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. అంతర్జాతీయంగా వ్యాపిస్తున్న వివిధ రకాల అంటువ్యాధులు, ముఖ్యంగా ప్రమాదకరమైన బర్డ్ ఫ్లూ తదితర వైరస్ ల ముప్పు పొంచి ఉన్న నేపథ్యంలో ఈ ముందస్తు జాగ్రత్తలు తీసుకున్నట్లు స్పష్టం చేసింది. సౌదీ ప్రభుత్వం విడుదల చేసిన ఈ తాజా జాబితాలో భారత్‌తో పాటు చైనా, జర్మనీ, బ్రిటన్, జపాన్, ఇండోనేషియా, ఆఫ్ఘనిస్థాన్, బంగ్లాదేశ్, నేపాల్ వంటి దేశాలు ఉన్నాయి. వీటితో పాటు మరో 16 దేశాల్లోని నిర్దిష్ట ప్రాంతాలపై పాక్షిక ఆంక్షలు విధించింది. వీటిలో అమెరికా, ఆస్ట్రేలియా, ఇటలీ, ఫ్రాన్స్ వంటి దేశాలు ఉన్నాయి. అంతర్జాతీయ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తూ ఈ దేశాల జాబితాను సవరిస్తామని అధికారులు వెల్లడించారు. అయితే, ఈ నిషేధం కేవలం పచ్చి మాంసం, గుడ్లకు మాత్రమే వర్తిస్తుందని సౌదీ అధికారులు క్లారిటీ ఇచ్చారు. ఆహార భద్రతా ప్రమాణాలకు అనుగుణంగా తగిన ఉష్ణోగ్రత వద్ద ఉడికించిన పౌల్ట్రీ ఉత్పత్తులకు ఈ నిషేధం నుండి మినహాయింపు ఇచ్చారు. వైరస్ వ్యాప్తి చెందే అవకాశం లేని విధంగా ప్రాసెస్ చేసిన ఉత్పత్తులు, ధృవీకరించబడిన సంస్థల నుండి వస్తే అనుమతిస్తామని పేర్కొన్నారు.

## అనిల్ అంబానీ 3,700 కోట్ల ఆస్తులు అటాచ్

**పాల్ హిల్ నివాస ఆస్తిని జప్తు చేసిన ఈడీ**

**ఇప్పటి వరకు అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.15,700 కోట్లు**




ముంబై: రిలయన్స్ కమ్యూనికేషన్స్ లిమిటెడ్ (ఆర్.కామ్.) బ్యాంకు మోసం కేసుకు సంబంధించి ప్రముఖ వ్యాపారవేత్త అనిల్ అంబానీకి చెందిన రూ.3,716.83 కోట్ల విలువైన పాలి హిల్ నివాస ఆస్తిని ఈడీ బుధవారం తాత్కాలికంగా జప్తు చేసింది. 17 అంతస్తులతో 66 మీటర్ల ఎత్తు ఉన్న ఈ విలాసవంతమైన ఇంటి విలువ రూ.3,716 కోట్లు ఉంటుందని అంచనా. మనీలాండరింగ్ నిరోధక చట్టం (పీఎంఎల్ఏ) కింద ఈ చర్యలు తీసుకున్నట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. అనిల్ గ్రూప్ కంపెనీలు కోట్లాది రూపాయల బ్యాంకు రుణాల మోసానికి పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నాయి. రిలయన్స్ కమ్యూనికేషన్స్‌తో సంబంధం ఉన్న ఈ కేసులో భాగంగా ఆ ఇంటిని ఈడీ అటాచ్ చేసినట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. గతంలో ముంబైలోని రూ.473.17 కోట్ల విలువైన ఆస్తిని కూడా ఈడీ అటాచ్ చేసింది. ఈ కేసుతో ఈడీ అటాచ్ చేసిన ఆస్తుల విలువ రూ.15,700 కోట్లకు చేరింది. ఆర్.కామ్., దాని అనుబంధ సంస్థలు దేశీ, విదేశీ రుణదాతల నుంచి తీసుకున్న మొత్తంలో రూ.40,185 కోట్ల బకాయిలు ఉన్నాయి.



## త్రివర్ణంలో ఇజ్రాయెల్ పార్లమెంట్

జెరూసలెం: ప్రధాని మోదీ ఇజ్రాయెల్ పర్యటన వేళ పార్లమెంట్ 'నెస్సెట్' భవనాన్ని మంగళవారం రాత్రి భారత త్రివర్ణ పతాక రంగులతో దేదీప్యమానంగా అలంకరించారు. స్థానిక మీడియా కూడా మోదీ పర్యటనకు విశేష ప్రాధాన్యత ఇచ్చింది. ప్రముఖ దినపత్రిక 'ది జెరూసలేం పోస్ట్' తన ముఖచిత్రంలో మోదీ ఫొటోను ప్రచురించి, "నమస్తే, రెండు ప్రాచీన దేశాలు కొత్త అధ్యాయాన్ని ప్రారంభిస్తున్నాయి" అనే శీర్షికతో కథనాన్ని ప్రచురించింది. పత్రిక ఎడిటర్-ఇన్-చీఫ్ జ్వికా క్లెయిన్ తన 'ఎక్స్' ఖాతాలో ఈ స్పెషల్ కవర్ పేజీని షేర్ చేశారు. ప్రధాని మోదీ అభివాదం చేస్తున్న ఫొటోతో పాటు "వెల్కమ్ మోదీ", "నమస్తే" అంటూ హెడ్డింగ్స్ ఇచ్చారు. భారత్-ఇజ్రాయెల్ మధ్య బలపడుతున్న మైత్రికి ఇది నిదర్శనమని పత్రిక పేర్కొంది.










# విరోష్ వెడ్డింగ్..

## ఉదయపూర్‌కు పురోహితులు

టాలీవుడ్ సెన్సేషనల్ జంట విజయ్ దేవరకొండ, రష్మిక మందన్న (విరోష్) పెళ్లి సందడి పీక్స్‌కు చేరింది. గురువారం జరగనున్న వీరి వివాహ వేడుకకు సర్వం సిద్ధమైంది. ఈ క్రమంలో భారత ప్రధాని నరేంద్ర మోదీ ఈ జంటకు ప్రత్యేకంగా శుభాకాంక్షలు తెలపడం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్‌గా మారింది. మరోవైపు పెళ్లి చేయించే పురోహితులు కూడా వేదిక వద్దకు చేరుకోవడంతో సోషల్ మీడియాలో 'విరోష్' వెడ్డింగ్ హంగామా మొదలైంది. విజయ్ దేవరకొండ తల్లిదండ్రులు పంపిన వివాహ ఆహ్వానానికి స్పందిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ పంపిన సందేశం ఇప్పుడు అందరినీ ఆకట్టుకుంటోంది. కొత్తగా పెళ్లి చేసుకోబోతున్న ఈ జంటకు ఆయన హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. వివాహం అనేది జీవితంలో ఒక అందమైన కొత్త అధ్యాయమని, ఒకరినొకరు అర్థం చేసుకుంటూ, గౌరవించుకుంటూ సాగిపోయే ఈ ప్రయాణం కలకాలం నిలవాలని ఆయన ఆశీర్వదించారు. విజయ్, నేషనల్ క్రష్ రష్మికల పెళ్లికి సాక్షాత్తూ ప్రధాని నుండి విష్ రావడంతో ఈ వేడుక మరింత ప్రత్యేకతను సంతరించుకుంది. పెళ్లి ముహూర్తం దగ్గరపడుతుండటంతో ఏర్పాట్లు కూడా శరవేగంగా జరుగుతున్నాయి. తాజాగా పెళ్లి జరిపించే ప్రధాన పురోహితులు ఎయిర్‌పోర్ట్‌కు చేరుకున్న వీడియో నెట్టింట వైరల్ అవుతోంది. నిర్వాహకులు వారిని సాదరంగా వెడ్డింగ్ వెన్యూకి తీసుకెళ్తున్న దృశ్యాలు చూస్తుంటే, అసలైన పెళ్లి తంతు మొదలైపోయిందని అర్థమవుతోంది. ఇక ఉదయపూర్ లాంటి డెస్టినేషన్ వెడ్డింగ్ స్పాట్‌లో విరోష్ పెళ్లి సందడి ఇప్పుడు అంబరాన్ని తాకుతోంది. గెస్టుల రాక, సంగీత్ ఏర్పాట్లతో ఆ ప్రాంతమంతా ఒక పండుగ వాతావరణాన్ని తలపిస్తోంది.




### ఉదయ్‌పూర్‌లో అంబానీ విమానం

విరోష్ విహహ అతిథులలో ప్రపంచ కుభేరుడు ముఖేష్ అంబానీ, ఆయన కుటుంబ సభ్యులు ఉన్నారని ప్రచారం సాగుతోంది. ఈ ప్రచారానికి తగ్గట్టుగానే అంబానీ కుటుంబం ఉదయ్ పూర్ లో విమానం దిగడంతో ఒకటే గుసగుసలు వేడెక్కించేస్తున్నాయి. ముఖేష్ అంబానీ, నీతా అంబానీ, కోకిలాబెన్ అంబానీ, ఆకాష్ అంబానీ, శ్లోకా అంబానీలు వివాహ వేడుకకు హాజరవుతారని వరుస కథనాలు వెలువడుతున్నాయి. అయితే అంబానీ కుటుంబం ఉదయపూర్ సందర్శనకు రష్మిక, విజయ్ వివాహానికి ఎటువంటి సంబంధం లేదని తెలుస్తోంది. ఉదయ్ పూర్ లోని నాథ్ ద్వారాలో ఉన్న శ్రీనాథ్ జీ ఆలయంలో ఆశీర్వాదం పొందడానికి అంబానీ కుటుంబ సభ్యులు ఉదయపూర్ వెళ్లినట్లు సమాచారం. కాగా, ఈ సెలబ్రిటీ వివాహ వేడుక చాలా ప్రైవేట్‌గా కేవలం 100 మంది అత్యంత సన్నిహితుల మధ్య జరుగుతోంది. ఇప్పటివరకు ఉదయ్‌పూర్ ఎయిర్‌పోర్టులో కనిపించిన ప్రముఖుల జాబితా చూస్తే, దర్శకుడు తరుణ్ భాస్కర్, నటి ఈషా రెబ్బా, నటి ఆషికా రంగనాథ్, దర్శకుడు రాహుల్ రవీంద్రన్ తదితరులు కనిపించారు.




## భోగి నుండి శర్వా ఫస్ట్ లుక్ రిలీజ్

తెలుగు సినిమా పరిశ్రమలో ప్రయోగాత్మక చిత్రాలకు కేరాఫ్ శర్వానంద్. ఈయన హిట్టు, ఫ్లాపుతో సంబంధం లేకుండా ఎక్కువ శాతం విభిన్న కథాంశాలతో రూపొందే చిత్రాల్లో నటిస్తూ వస్తున్నాడు. ప్రస్తుతం శర్వానంద్, సంపత్ నంది దర్శకత్వంలో తెరకెక్కుతున్న 'భోగి' అనే చిత్రంలో నటిస్తున్నాడు. తాజాగా ఈ మూవీ యూనిట్ ఈ సినిమా నుండి శర్వానంద్ ఫస్ట్ లుక్ పోస్టర్‌ను విడుదల చేసింది. అలాగే ఈ చిత్ర విడుదల తేదీని కూడా ప్రకటించింది. ఇక ఈ ఫస్ట్ లుక్ పోస్టర్లో శర్వానంద్ ఒక చేతిలో కత్తిని పట్టుకొని, గుబురు మీసంతో, పెద్ద కళ్ళతో చూస్తున్నాడు. ఈ పోస్టర్‌ను బట్టి చూస్తుంటే ఇది పక్కా మాస్ ఎంటర్టైనర్ అని అర్థమవుతుంది. ఇప్పటివరకు శర్వానంద్ తన కెరీర్లో ఈ స్థాయి మాస్ లుక్లో ఎప్పుడూ కనిపించలేదు. దాంతో ఈ సినిమాపై ప్రేక్షకుల్లో మంచి అంచనాలు ఏర్పడే అవకాశం ఉంది. ఆగస్టు 28, 2026న ఈ చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు ప్రకటించారు. అనుపమ పరమేశ్వరన్, డింపుల్ హయాతి ఈ చిత్రంలో హీరోయిన్లుగా కనిపించనుండగా భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నాడు. కె.కె. రాధామోహన్ శ్రీ సత్య సాయి ఆర్ట్స్ బ్యానర్‌పై ఈ మూవీని నిర్మిస్తున్నాడు.

## ముందుచూపు తప్పనిసరి: తమన్నా



గ్లామర్ ప్రపంచంలో వెలుగులు ఎప్పటికీ నిలవవని, స్టార్‌డమ్ శాశ్వతం కాదని టాలీవుడ్ మిల్కీ బ్యూటీ తమన్నా భాటియా చేసిన తాజా వ్యాఖ్యలు ఇండస్ట్రీ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. అవకాశాలు వరుస పెడుతున్నప్పుడే ఫ్యూచర్ గురించి ఆలోచించాలి, లేకపోతే కెరీర్ చివరి దశలో ఆర్థిక ఇబ్బందులు తప్పవని ఆమె స్పష్టం చేసింది. సినిమా రంగం వెలుగుల ప్రపంచమే అయినా, అవకాశాలు తగ్గిన తర్వాత చాలామంది కళాకారులు ఎదుర్కొనే ఆర్థిక సమస్యలు కొత్తవి కావు. ఒకప్పుడు టాప్‌లో ఉన్నవారు కూడా తరువాతి కాలంలో ఇబ్బందులు పడిన సంఘటనలు చాలానే చూశాం. ఈ నేపథ్యంలో తమన్నా చేసిన వ్యాఖ్యలు యువ నటీనటులకు హెచ్చరికలా మారాయి. కెరీర్ పీక్‌లో ఉన్నప్పుడే ఫ్యూచర్ కోసం బలమైన ఆర్థిక ప్రణాళిక అవసరమని ఆమె సూచిస్తున్నారు. అయితే తనకు ఈ దూరదృష్టి రావడం వెనుక తన తండ్రి పాత్ర ఎంతో కీలకమని తమన్నా స్పష్టం చేశారు. ఇండస్ట్రీలోకి వచ్చిన తొలి రోజుల నుంచే తన ఆర్థిక వ్యవహారాలన్నీ తన తండ్రే చూసుకున్నారని.. ఖర్చు, పొదుపు, పెట్టుబడుల విషయంలో ఆయన చూపిన క్రమశిక్షణే తనను ఈ స్థాయిలో నిలబెట్టిందని తమన్నా పేర్కొన్నారు. తన తండ్రి నేర్పిన పాఠాలే తనను రియల్ ఎస్టేట్, జ్యువెలరీ బిజినెస్ లాంటి రంగాల్లో పెట్టుబడులు పెట్టేలా చేశాయని, కుటుంబం నుంచి వచ్చిన మార్గనిర్దేశమే తనకు భరోసానిచ్చిందని తమన్నా వెల్లడించారు.

## ది కేరళ స్టోరీ -2పై పిటిషన్‌లో అబద్ధాలు




'ది కేరళ స్టోరీ 2' చిత్రంపై దాఖలైన పిటిషన్లపై ఆ చిత్ర నిర్మాత విపుల్ అమృత్ లాల్ షా ఘాటుగా స్పందించారు. తమ చిత్రంపై దాఖలైన ముందస్తు పిటిషన్లు పూర్తిగా అపోహలతో కూడినవేనని అన్నారు. ఈ మేరకు బుధవారం కేరళ హైకోర్టుకు అఫిడవిట్ సమర్పించారు. సినిమా ఇంకా విడుదల కాకముందే, కేవలం టైటిల్ ఆధారంగా అభ్యంతరాలు వ్యక్తం చేయడం తగదని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా టైటిల్‌లో ఉన్న (ది) గురించి వెల్లువెత్తిన నిరసనలకు సమాధానం ఇస్తూ... అది తమ ఫ్రాంచైజ్‌లోని మొదటి చిత్రం అయిన కేరళ స్టోరీకి సూచన మాత్రమేనని, దాని వల్ల సీక్వెల్ కథాంశం కేవలం కేరళ రాష్ట్రానికే పరిమితం అవుతుందని భావిస్తూ పిటిషన్ దాఖలు చేయడం ప్రజలను తప్పుదారి పట్టించడం అవుతుందన్నారు. 'ది' అనే పదం సినిమా బ్రాండ్ గుర్తింపును కొనసాగించడానికి మాత్రమే వాడినదని, అది కథను ఒకే రాష్ట్రానికి చెందినది మాత్రమే అని కాదని అఫిడవిట్‌లో పేర్కొన్నారు. పూర్తిస్థాయి కథ, దాని నేపథ్యం, సందేశం ఏమిటో తెలియకుండానే పిటిషన్లు వేయడం కేవలం అపోహలు, అబద్ధపు ఊహాగానాలేనని ఆయన పేర్కొన్నారు. చిత్రాన్ని చూడకముందే అభ్యంతరాలు వ్యక్తం చేయడం న్యాయసమ్మతం కాదని, ఇది సినిమా కలిగించే చర్యగా మారవచ్చని అన్నారు.

## గ్లామర్ ఫుడీ.. శాన్వీ




కన్నడ బ్యూటీ శాన్వీ శ్రీవాస్తవ సోషల్ మీడియాలో ఎప్పుడూ యాక్టివ్‌గా ఉంటూ తన అభిమానులను అలరిస్తుంటుంది. తాజాగా ఆమె షేర్ చేసిన ఫోటోలు ఇప్పుడు నెట్టింట వైరల్ అవుతున్నాయి. తను తింటున్న ఫుడ్‌ను ఎంజాయ్ చేస్తూనే, అదిరిపోయే గ్లామరస్ డ్రెస్సులో శాన్వీ మెరిసిపోయింది. నేను, నా ట్రావెల్ ప్లాన్స్, నా ఫుడ్.. అప్పుడే దేన్నో మిస్ అవుతున్నట్టు ఉంది అంటూ ఆమె పెట్టిన క్యాప్షన్ ఫ్యాన్స్‌ను ఆకట్టుకుంటోంది. ఈ ఫోటోల్లో శాన్వీ అందం, స్టైల్ చూసి నెటిజన్లు ఫిదా అవుతున్నారు. 'నేను, నా ప్రయాణాలు, నా తిండి.. కానీ ఏదో ఒకటి అప్పుడే మిస్ అవుతున్నట్టు అనిపిస్తోంది' అని రాసుకొచ్చింది. ఆ మిస్ అవుతున్న 'ఒక్కటి' ఏమై ఉంటుంది అని ఫ్యాన్స్ ఆరా తీస్తున్నారు. ఇక అది తన షూటింగ్‌ల గురించా? లేక తనకి ఇష్టమైన వ్యక్తి గురించా? అంటూ ప్రశ్నల వర్షం కురిపిస్తున్నారు. ఏది ఏమైనా, తన ట్రావెల్ అండ్ ఫుడ్ మూమెంట్స్‌ను ఇంత అందంగా కెమెరాలో బంధించి ఫ్యాన్స్‌కు ట్రీట్ ఇచ్చింది శాన్వీ.

## రాజమౌళి గురి.. నయన్



లెజెండరీ డైరెక్టర్ రాజమౌళిపై గురి పెట్టింది యువ నాయిక నయన్ సారిక. ఈ భామ గురించి ప్రత్యేక పరిచయం అవసరం లేదు. మిస్టేక్ చిత్రంలో పార్వతి పాత్రతో తెలుగులో లాంచ్ అయింది. అటుపై గం గం గణేశా లో ఆనంద్ దేవరకొండ సరసన శృతి పాత్రలో కనిపించింది. ఈ సినిమాతో ఆమెకు మంచి గుర్తింపు వచ్చింది. అనంతరం ఆయ్ చిత్రంలో ఫంక్ పల్లవి పాత్రలో అలరించింది. ఈ పాత్రతో తెలుగు ఆడియన్స్ కు మరింత దగ్గరైంది. సస్పెన్స్ థ్రిల్లర్ క లోనూ డీసెంట్ పాత్రలో కనిపించింది. అలరించింది. మాలీవుడ్ లో వృషభ లాంటి పాన్ ఇండియా చిత్రంలోనూ నటించింది. శ్రీవిష్ణు హీరోగా నటించినవిష్ణు విన్యాసంలోనూ నటించింది. త్వరలోనే ఈ చిత్రం రిలీజ్ అవుతుంది. పినాక అనే చిత్రంతో కన్నడలోనూ లాంచ్ అవుతుంది. ఇలా కొంత ఐడెంటిటీ సంపాదించిన బ్యూటీ సినిమాల నుంచి రిటైర్మెంట్ తీసుకునే లోపు రాజమౌళి సినిమాలో నటించి కెరీర్ ని పరిపూర్ణం చేసుకోవాలని ఆశపడుతుంది. మరి అమ్మడి కోరిక నెర వేరుతుందా? లేదా? అన్నది చూడాలి.



# పాక్ కెప్టెన్ ఫ్యామిలీపై బూతులు

టీ20 ప్రపంచ కప్ సూపర్-8 దశలో ఇంగ్లాండ్ జట్టుతో జరిగిన ఉత్కంఠభరిత పోరులో పాకిస్థాన్ ఓడిపోవడాన్ని ఆ దేశ అభిమానులు అస్సలు జీర్ణించుకోలేకపోతున్నారు. ఈ క్రమంలో వారు తమ విజ్ఞతను మరచి పాకిస్థాన్ కెప్టెన్ సల్మాన్ అలీ ఆఘా కుటుంబ సభ్యులను టార్గెట్ చేశారు. సోషల్ మీడియా వేదికగా ఆయన భార్య సబ్బా మంజూర్, వారి కుమారుడిని ఉద్దేశించి అత్యంత అసభ్యకరమైన పదజాలంతో విమర్శలు గుప్పించారు. కేవలం ఆటలో ఓడిపోయినందుకు ఒక క్రీడాకారుడి కుటుంబాన్ని ఇలా హింసించడం ఇప్పుడు క్రీడా లోకంలో తీవ్ర చర్చకు దారితీసింది. తమపై జరుగుతున్న ఈ డిజిటల్ దాడిని సల్మాన్ భార్య సబ్బా మంజూర్ తీవ్రంగా పరిగణించారు. ఆమె ఇన్‌స్టాగ్రామ్ వేదికగా స్పందిస్తూ అభిమానులకు గట్టి కౌంటర్ ఇచ్చారు. "నన్ను లేదా నా అమాయకపు కుమారుడిని దూషించినంత మాత్రాన మీకు ప్రపంచకప్ రాదు" అంటూ ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఓటమికి ఆటగాళ్లను విమర్శించడం సహజమే అయినా.. వారి వ్యక్తిగత జీవితాలన, పసిబిడ్డలను వివాదాల్లోకి లాగడం అత్యంత హీనమైన చర్య అని ఆమె ఘాటుగా సమాధానమిచ్చారు.

# ఇంటికి లంక

## సెమీస్ రేసు నుంచి అవుట్

## కివీస్‌పై ఘోర పరాజయం



టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా సూపర్-8 రౌండ్‌లో భాగంగా బుధవారం జరిగిన కీలక మ్యాచ్‌లో న్యూజిలాండ్ 61 పరుగుల తేడాతో శ్రీలంకను చిత్తు చేసింది. కివీస్ బ్యాటర్లు పోరాడదగ్గ స్కోరు సాధించగా.. బౌలర్లు లంక బ్యాటింగ్ లైనప్‌ను కోలుకోలేని దెబ్బకొట్టారు. టాస్ ఓడి మొదట బ్యాటింగ్‌కు దిగిన న్యూజిలాండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 168 పరుగులు చేసింది. కివీస్ బ్యాటర్లు క్రమబద్ధంగా పరుగులు సాదిస్తూ లంక బౌలర్లపై ఒత్తిడి పెంచారు. శ్రీలంక బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసినప్పటికీ, కీలక సమయాల్లో కివీస్ హిట్టర్లు బౌండరీలతో స్కోరు బోర్డును ముందుకు నడిపించారు. కివీస్ బ్యాటర్లలో కెప్టెన్ మిచెల్ సాంట్నర్(47), రచిన్ రవీంద్ర(32), మెకాంచీ(31) రాణించారు. లంక బౌలర్లలో మహీశ్ తీక్షణ, దుష్మంత చమీరా తలో 3 వికెట్లు పడగొట్టగా.. యువ స్పిన్నర్ వెల్లాలగే ఒక వికెట్ తీశాడు. 169 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన శ్రీలంకకు ఆరంభం నుండే కష్టాలు మొదలయ్యాయి. కివీస్ బౌలర్ల స్వింగ్, లెంగ్త్‌ను అర్థం చేసుకోవడంలో లంక బ్యాటర్లు పూర్తిగా విఫలమయ్యారు. వరుస వికెట్లు కోల్పోవడంతో ఏ దశలోనూ శ్రీలంక లక్ష్యం దిశగా పయనించలేదు. చివరకు 20 ఓవర్లు ఆడినప్పటికీ, కేవలం 107 పరుగులు మాత్రమే చేసి లంక చేతులెత్తేసింది. శ్రీలంక బ్యాటర్లలో కమిందు మెండిస్(31), వెల్లాలగే(29) పరుగులు చేశారు. కివీస్ బౌలర్లలో రచిన్ రవీంద్ర 4 వికెట్లు పడగొట్టి లంక నడ్డి విరవగా.. మ్యాట్ హెన్రీ 2 వికెట్లు పడగొట్టాడు. కెప్టెన్ సాంట్నర్ ఒక వికెట్ తీశాడు. న్యూజిలాండ్ విజయంలో స్పిన్ ఆల్‌రౌండర్ రచిన్ రవీంద్ర కీలక పాత్ర పోషించాడు. బంతితో లంక బ్యాటర్లను ముప్పుతిప్పలు పెట్టి కీలక వికెట్లు పడగొట్టాడు. రవీంద్రతో పాటు ఇతర కివీస్ బౌలర్లు కూడా సమిష్టిగా రాణించడంతో లంక జట్టు 100 పరుగుల మార్కును దాటడానికే ఇబ్బంది పడింది. ఈ భారీ ఓటమితో శ్రీలంక సెమీఫైనల్ ఆశలు ఆవిరయ్యా యి. సూపర్-8లో వరుస ఓటములతో ఆ జట్టు టోర్నీ నుండి నిష్క్రమించగా.. న్యూజిలాండ్ తన మొదటి విజయాన్ని నమోదు చేసి సెమీస్ రేసులో నిలిచింది. గ్రూప్ సమీకరణాల ప్రకారం కివీస్ జట్టు ఇప్పుడు సెమీఫైనల్ దిశగా ఒక బలమైన అడుగు వేసింది.



# ముంబైలో ఇల్లు కొన్న సూర్య!

టీమిండియా టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ ముంబైలో మంచి ఇన్వెస్ట్‌మెంట్ పై కన్నేశాడు. ఆయన ఆలోచనను తన సతీమణి దేవిశా యాదవ్ పర్ఫెక్ట్‌గా ఇంప్లిమెంట్ చేశారు. ఈ రోజుల్లో ఇల్లు కొనడమంటే మామూలు విషయం కాదు. అది కూడా ముంబైలాంటి మహానగరంలో. కానీ సూర్యాభాయ్ మాత్రం తన ఫ్యూచర్ కోసం మంచి ప్లానింగ్ చేశాడు. కెరీర్ బలంగా ఉండగానే తన ఫైనాన్షియల్ ప్లానింగ్ కూడా మనోడు గట్టిగానే చేశాడు. ముంబై తూర్పు శివారులో 7.18 కోట్లతో విలాసవంతమైన అపార్ట్‌మెంట్‌ను కొనుగోలు చేశాడు. సీఆర్ఈ మ్యాట్రిక్స్ నివేదిక ప్రకారం గోద్రేజ్ స్కై టెర్రస్ ప్రాజెక్ట్‌లోని ఈ ఫ్లాట్ రిజిస్ట్రేషన్ 2026 ఫిబ్రవరి 20న జరగ్గా, రూ. 35.90 లక్షల స్టాంప్ డ్యూటీ, 30000 రిజిస్ట్రేషన్ ఛార్జీలు చెల్లించారు. కేవలం సూర్యాభాయ్ చెల్లించిన స్టాంప్ డ్యూటీతో ఒక మధ్య తరగతి కుటుంబం ఇల్లు కొనగలదు. చెంబూర్- డియోనార్‌లోని గోద్రేజ్ స్కై టెర్రస్‌లో ఉన్న ఈ అపార్ట్‌మెంట్ సుమారు 140.86 చదరపు మీటర్ల (1,500 చదరపు అడుగులు) విస్తీర్ణంలో ఆధునిక సదుపాయాలతోపాటు రెండు కార్లకు సరిపడా పార్కింగ్ స్పేస్ ఉంది.



# గంభీర్ వ్యూహాలు తప్పు: పాంటింగ్

టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో టీమిండియా ఎదుర్కొన్న పరాజయం జట్టు ఎంపికపై అనేక సందేహాలను రేకెత్తించింది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా మాజీ కెప్టెన్ రికీ పాంటింగ్ ఐసీసీ రివ్యూలో మాట్లాడుతూ.. భారత హెడ్ కోచ్ గౌతమ్ గంభీర్ అనుసరిస్తున్న వ్యూహాలను తప్పుబట్టారు. కేవలం ప్రత్యర్థి జట్టులోని ఆటగాళ్లను బట్టి జట్టులో మార్పులు చేయడం వల్ల ఆశించిన ఫలితాలు రావని.. ఇది టీమ్ స్థిరత్వాన్ని దెబ్బతీస్తుందని ఆయన హెచ్చరించారు. ముఖ్యంగా ఒత్తిడి ఉన్న సమయంలో ప్రయోగాల కంటే అత్యుత్తమ ఆటగాళ్లపై నమ్మకం ఉంచడమే ముఖ్యమని ఆయన అభిప్రాయపడ్డారు. గత మ్యాచ్‌లో వైస్ కెప్టెన్ అక్షర్ పటేల్‌ను తుది జట్టులో తీసుకోకపోవడాన్ని రికీ పాంటింగ్ తీవ్రంగా విమర్శించారు. ప్రత్యర్థి జట్టులో ఎడమచేతి వాటం బ్యాటర్లు ఉన్నారనే కారణంతో అక్షర్‌ను పక్కన పెట్టి, వాషింగ్టన్ సుందర్‌ను తీసుకోవడం సరైన నిర్ణయం కాదని ఆయన పేర్కొన్నారు. ఒకే ఒక మార్పు వల్ల టోర్నమెంట్ తలరాత మారిపోదని, అక్షర్ వంటి కీలక ఆటగాడిని పక్కన పెట్టడం వల్ల జట్టులో ప్రతికూల సంకేతాలు వెళ్తాయని పాంటింగ్ విశ్లేషించారు. పరిస్థితులకు అనుగుణంగా బెస్ట్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ముందే నిర్ణయించుకోవాలని సూచించారు. చెన్నైలో జింబాబ్వేతో జరగనున్న కీలక మ్యాచ్‌కు ముందు బౌలింగ్ విభాగాన్ని బలోపేతం చేయాలని రికీ పాంటింగ్ సూచించారు. స్పిన్నర్ కుల్దీప్ యాదవ్‌ను జట్టులోకి తీసుకోవడం అత్యవసరమని ఆయన అన్నారు. బ్యాటర్ ఎడమచేతి వాటమా లేక కుడిచేతి వాటమా అన్న దానితో సంబంధం లేకుండా ఏ బ్యాటర్నయినా బోల్తా కొట్టించే నైపుణ్యం కుల్దీప్‌కు ఉందని గుర్తు చేశారు. అలాగే బ్యాటింగ్ లోతును పెంచడం కోసం బౌలింగ్ బలాన్ని తగ్గించుకోవద్దని.. టాప్-7 బ్యాటర్లే బాధ్యత తీసుకుని మ్యాచ్‌ను గెలిపించాలని ఆయన స్పష్టం చేశారు. డ్రెస్సింగ్ రూమ్‌లో వాతావరణాన్ని ప్రశాంతంగా ఉంచాలని గంభీర్‌కు పాంటింగ్ సలహా ఇచ్చారు. టీమిండియాలో అద్భుతమైన ప్రతిభ ఉన్న ఆటగాళ్లు ఉన్నారని.. అనవసరమైన ఆందోళనలకు పోకుండా సహజసిద్ధమైన ఆట ఆడితే భారత్ ఖచ్చితంగా పుంజుకుంటుందని ఆయన ధీమా వ్యక్తం చేశారు. ఎంపికలో తీసుకునే చిన్న చిన్న నిర్ణయాల కంటే.. మైదానంలో బౌలర్లను కెప్టెన్ ఎలా ఉపయోగిస్తాడు అనేదే గెలుపోటములను శాసిస్తుందని పాంటింగ్ ఈ సందర్భంగా గుర్తు చేశారు.

# రంజీ ఫైనల్‌లో రచ్చ

**కర్ణాటక ఆటగాడిపై జమ్మూ కెప్టెన్ దాడి**

హుబ్లీ వేదికగా జమ్మూ కశ్మీర్, కర్ణాటక జట్ల మధ్య జరుగుతున్న రంజీ ట్రోఫీ 2025-26 ఫైనల్ మ్యాచ్‌లో ఊహించని పరిణామం చోటుచేసుకుంది. ఆట రెండో రోజైన ఫిబ్రవరి 25న జమ్మూ కెప్టెన్ పారస్ డోగ్రా అత్యుత్సాహానికి పోయి కర్ణాటక ప్లేయర్ కేవీ అనీష్‌ను తలతో బలంగా కొట్టడం తీవ్రదుమారం రేపింది. జమ్మూ కాశ్మీర్ ఇన్నింగ్స్ 101వ ఓవర్ వద్ద ఈ వివాదం మొదలైంది. ప్రసిద్ధ్ కృష్ణ వేసిన బంతి పారస్ డోగ్రా బ్యాట్‌కు తగిలి బౌండరీకి వెళ్లింది. ఆ సమయంలో ఫార్వర్డ్ షార్ట్ లెగ్ వద్ద ఫీల్డింగ్ చేస్తున్న సబ్‌స్టిట్యూట్ ఫీల్డర్ కేవీ అనీష్‌తో పారస్ డోగ్రాకు మాటల యుద్ధం జరిగింది. ఈ క్రమంలో సహనం కోల్పోయిన డోగ్రా.. అనీష్ దగ్గరికి వెళ్లి తలతో అతడి తలను బలంగా ఢీకొట్టాడు. దీంతో ఒక్కసారిగా మైదానంలో వాతావరణం వేడెక్కింది. ఈ భౌతిక దాడిని చూసిన కర్ణాటక సీనియర్ ఓపెనర్ మయాంక్ అగర్వాల్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తూ పారస్ డోగ్రా వైపు దూసుకెళ్లాడు. పరిస్థితి చేయి దాటిపోతుండటంతో అంపైర్లు మధ్యలో వచ్చి ప్లేయర్లను శాంతింపజేసే ప్రయత్నం చేశారు. స్టార్ క్రికెటర్ కేఎల్ రాహుల్ కూడా డోగ్రాతో మాట్లాడి పద్ధతి మార్చుకోవాలని సూచించాడు. మరోవైపు కర్ణాటక కెప్టెన్ దేవదత్ పడిక్కల్ ఈ విషయంపై అంపైర్లకు అధికారికంగా ఫిర్యాదు చేశాడు. ఓవర్ ముగిసిన తర్వాత డోగ్రా తన తప్పు తెలుసుకుని అనీష్ వద్దకు వెళ్లి క్షమాపణలు చెప్పాడు. అయితే పారస్ డోగ్రా చేసిన పనికి తీవ్రంగా నొచ్చుకున్న అనీష్, ఆ క్షమాపణలను స్వీకరించడానికి నిరాకరించాడు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ అవ్వడంతో, డోగ్రాపై నెటిజన్లు తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పిస్తున్నారు. ఫైనల్ వంటి పెద్ద మ్యాచ్‌లో ఇలాంటి ప్రవర్తన ఆమోదయోగ్యం కాదని క్రీడా విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు.



# సంజూకు చాన్స్!

## బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు.. లెఫ్ట్-రైట్ కాంబినేషన్‌పై నజర్



టీ20 ప్రపంచ కప్ 2026 సూపర్-8 దశలో దక్షిణాఫ్రికా చేతిలో ఎదురైన భారీ ఓటమి టీమిండియాను ఆత్మరక్షణలో పడేసింది. అహ్మదాబాద్ వేదికగా జరిగిన ఆ మ్యాచ్‌లో 76 పరుగుల తేడాతో ఓడిపోవడం వల్ల భారత్ సెమీఫైనల్ అవకాశాలు క్లిష్టంగా మారాయి. ఈ నేపథ్యంలో జట్టు ప్రదర్శనపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ముఖ్యంగా బ్యాటింగ్ విభాగంలో టాపార్డర్ వైఫల్యం, లెఫ్టార్మ్ బ్యాటర్లు ఆఫ్ స్పిన్నర్ల బౌలింగ్‌లో తడబడటం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుత టోర్నీలో యువ ఆటగాళ్లు అభిషేక్ శర్మ, తిలక్ వర్మ ఆశించిన స్థాయిలో రాణించలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో జింబాబ్వేతో మ్యాచులో ఓటమితో టీమిండియాలో మార్పులు జరిగే అవకాశం కనిపిస్తోంది. ముఖ్యంగా యంగ్ ఓపెనర్ సంజూ శాంసన్ జట్టులో తిరిగి చేరే అవకాశాలున్నాయి. సంజూ శాంసన్‌ను ఆడించే అంశంపై టీమిండియా బ్యాటింగ్ కోచ్ సితాన్షు కోటక్ తీవ్రంగా ఆలోచిస్తున్నట్లు సమాచారం. ముఖ్యంగా బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేయాలని టీం భావిస్తోంది. ఇటీవల టీమిండియా బ్యాటింగ్‌లో విఫలమవుతోంది. ముఖ్యంగా బ్యాటర్లు త్వరగా వికెట్లు కోల్పోతున్నారు. తొలి ఓవర్లలోనే వికెట్లు పోతున్నాయి. దీంతో భారత్ భారీ స్కోరు సాధించలేకపోతుంది. అందుకే బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు చేసే అంశాన్ని పరిశీలిస్తున్నట్లు సితాన్షు కోటక్ తెలిపాడు. బ్యాటింగ్‌కు సంబంధించి లెఫ్ట్ హ్యాండర్లు ఎక్కువగా ఉన్నారు. అందుకే రైట్ హ్యాండర్ అయిన సంజూను ఆడిస్తే మెరుగైన ఫలితం ఉంటుందని కోటక్ ఆలోచిస్తున్నాడు. సంజూను తీసుకుంటే ఒక లెఫ్ట్ హ్యాండర్, ఒక రైట్ హ్యాండర్ బ్యాటింగ్ చేస్తారు. ఇది మంచి ఫలితం ఇస్తుందని జట్టు యోచన. ప్రస్తుతం సంజూతో నెట్స్‌లో బాగా ప్రాక్టీస్ చేయిస్తున్నారు. దీనర్థం సంజూ తుది జట్టులో ఆడటం గ్యారెంటీ అని కాదని కోటక్ అన్నాడు. సంజూను ఆడించాలంటే జట్టు బ్యాటింగ్ ఆర్డర్‌లో మార్పులు అవసరం. లోయర్ ఆర్డర్‌లో శివమ్ దూబేపై వేటు పడొచ్చు. లేదా తిలక్ వర్మను తప్పించి, అతడి స్థానంలో సంజూను తీసుకురావొచ్చు. టీ20లో జట్టు ప్రదర్శనకు సంబంధించి గత రెండేళ్లలో ఇదే అధ్వానం అనేది నిపుణుల మాట. గురువారం జింబాబ్వేతో జరగబోయే టీ20 మ్యాచ్ భారత్‌కు చాలా కీలకం. ఇండియా సెమీస్ రేసులో ఉండాలంటే ఈ మ్యాచులో గెలవడం చాలా ముఖ్యం.



## సంజూకు ఆడించాలి

తిలక్ వర్మ స్థానంలో అనుభవజ్ఞుడైన సంజూ శాంసన్‌ను తీసుకురావాలని పార్థివ్ పటేల్ అభిప్రాయపడ్డాడు. ఒకవేళ సంజూను జట్టులోకి తీసుకుంటే.. అతడిని నేరుగా నంబర్ 3 స్థానంలో ఆడించాలని, అది కుదరని పక్షంలో కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ తన బ్యాటింగ్ ఆర్డర్‌ను మార్చుకుని మూడో స్థానంలో రావాలని పార్థివ్ పేర్కొన్నాడు. రైట్ హ్యాండ్ బ్యాటర్ అయిన సంజూ రాకతో జట్టులో వైవిధ్యం పెరుగుతుందని తెలిపాడు.

ఈవార్తలు

# ప్రజావాణి

సంపాదకీయం

www.evarthalu.com

నేటి ఈవార్తలు


గురువారం 26-2-2026

# భారత్-ఇజ్రాయెల్ వ్యూహాత్మక మైత్రి



భారత ప్రధాని నరేంద్ర మోదీ తొమ్మిదేళ్ల విరామం తర్వాత ఇజ్రాయెల్‌లో జరిపిన పర్యటన, ఇరు దేశాల మధ్య ఉన్న 'వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని' సరికొత్త శిఖరాలకు తీసుకెళ్లింది. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు నెలకొన్న తరుణంలో జరిగిన ఈ పర్యటన, ప్రపంచ దౌత్య ముఖచిత్రంపై భారత్ యొక్క పెరుగుతున్న ప్రాధాన్యాన్ని చాటిచెప్పింది. ఇజ్రాయెల్ పార్లమెంటును ఉద్దేశించి ప్రసంగించిన మొదటి భారత ప్రధానిగా మోదీ రికార్డు సృష్టించారు. ఈ గౌరవం భారత్‌ను ఇజ్రాయెల్ అత్యున్నత స్థాయి మిత్రదేశాల జాబితాలో నిలిపింది. హమాస్ అక్టోబర్ 7న జరిపిన దాడులను ఖండిస్తూ, ఈ కష్టకాలంలో భారత్ ఇజ్రాయెల్‌కు అండగా ఉంటుందని మోదీ పునరుద్ఘాటించారు. అదే సమయంలో, ప్రాంతీయ శాంతి, స్థిరత్వం కోసం భారత్ మద్దతు ఇస్తుందని తెలిపారు. ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం 2024-25లో సుమారు 3.75 బిలియన్ డాలర్లకు చేరింది. ఈ పర్యటనలో ఫ్రీ ట్రేడ్ అగ్రిమెంట్‌పై చర్చలు వేగవంతం చేయడం ద్వారా ఆర్థిక సంబంధాలను మరింత బలోపేతం చేసే దిశగా అడుగులు పడ్డాయి. వ్యవసాయం, నీటి యాజమాన్యం, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, సైబర్ సెక్యూరిటీ వంటి రంగాల్లో సహకారాన్ని పెంచుకోవాలని ఇరు దేశాలు నిర్ణయించాయి. జెరూసలేం పోస్ట్ వంటి ప్రముఖ పత్రికలు నమస్తే మోదీ అని స్వాగతం పలకడం, ఇజ్రాయెల్ ప్రజల్లో మోదీకి ఉన్న ప్రజాదరణను ప్రతిబింబిస్తోంది. ఈ పర్యటన కేవలం రక్షణ, వాణిజ్య ఒప్పందాలకే పరిమితం కాకుండా, డీ-హైఫనేషన్ (ఇజ్రాయెల్, పాలస్తీనా సంబంధాలను వేర్వేరుగా చూడటం) విధానంలో భారత్ సాధించిన దౌత్య విజయానికి నిదర్శనంగా నిలుస్తుంది.

# నిప్పు కణిక.. వీర సావర్కర్



...నేడు వీర్ సావర్కర్ వర్ధంతి...

వినాయక్ దామోదర్ సావర్కర్..ఈ పేరు వినగానే భారతీయులందరి మదిలో దేశభక్తి ఉప్పొంగుతుంది. బ్రిటిష్ అధికారాన్ని ధిక్కరించి స్వాతంత్ర్య పోరాటాన్ని వారి దేశ రాజధాని నడిగడ్డ మీదకు తీసుకెళ్లిన విప్లవవీరుడు. ఎందరో విప్లవకారులకు, స్వాతంత్ర్య సమర యోధులకు స్ఫూర్తినిచ్చిన వీరుడు.. రెండు యావజ్జీవ కారాగార శిక్షలు పడి అండమాన్ జైలులో 27 ఏళ్లు దుర్భర జీవితం గడిపినా చలించని ధీరుడు వీర సావర్కర్. దేశం కోసం జీవితాన్ని అర్పించుకున్న సావర్కర్ బ్రిటిష్ పాలనపై పోరాటానికి మాత్రమే పరిమితం కాలేదు. ఒక కవిగా, రచయితగా, వక్తగా, చరిత్ర కారునిగా, సంఘ సంస్కర్తగా హైందవ సమాజాన్ని జాగృతం చేశారు. 1857 స్వాతంత్ర్య సంగ్రామం తర్వాత ఈస్టిండియా కంపెనీ నుంచి బ్రిటిష్ వారు భారత్‌ను స్వాధీనం చేసుకొని పాలనపై పట్టు బిగించారు. భారతీయుల పరిస్థితి పెనం నుంచి పొయ్యిలో పడ్డట్టైంది. వినాయక్ దామోదర్ సావర్కర్ జన్మించే నాటికి దేశం కఠోర బానిసత్వంలో మగ్గుతూ అష్టకష్టాలు పడుతోంది. దీనికితోడు సామాజిక కట్టుబాట్లు, మూఢ విశ్వాసాలలో మునిగిపోయిన భారత సమాజాన్ని సంస్కరించేందు ఎన్నో సాంఘిక, మత ఉద్యమాలు వచ్చాయి. మరోవైపు బ్రిటిష్‌పాలనకు వ్యతిరేకంగా శాంతియుత పోరాటాలకు తోడు రహస్య విప్లవోద్యమాలు కూడా ప్రారంభ మయ్యాయి. ఇలాంటి పరిస్థితుల్లో జన్మించిన సావర్కర్ స్వాతంత్ర్యం కోసం పోరాడే రహస్య విప్లవ యోధుడిగా మారాడు. అదే సమయంలో సాహితీవేత్తగా, చరిత్ర కారుని గా, సంఘసంస్కర్తగా భిన్న కోణాల్లో సేవలు అందించారు.

వినాయక్ దామోదర్ సావర్కర్ జీవితాన్ని రెండు భాగాలుగా ఆవిష్కరించవచ్చు. ఇందులో ముందుగా ప్రథమార్థాన్ని చూద్దాం. 1883 మే 28న నాసిక్ జిల్లా భాగూరు గ్రామంలో దామోదర్ పంత్, రాధాబాయి దంపతులకు జన్మించారు వినాయక్ దామోదర్ సావర్కర్. సావర్కర్ అన్న గణేష్ దామోదర్ సావర్కర్, తమ్ముడు నారాయణ రావు సావర్కర్. ఈ ముగ్గురు సోదరులు చిన్నప్పుడే తల్లిదండ్రులను పోగొట్టుకున్నారు. ఆనాటి బ్రిటిష్ పాలనలో భారతీయులు పడుతున్న కష్టాలను చూసి చలించిపోయిన సావర్కర్ సోదరులు తమ కుల దేవత అష్టభుజాదేవి ముందు దేశ స్వాతంత్ర్యం కోసం తమ జీవితాన్ని సమర్పిస్తామని ప్రతిజ్ఞ చేశారు. ఈ ఆశయ సాధన కోసం 'రాష్ట్ర భక్త సమూహ్, మిత్ర మేళా, అభినవ భారత్' అనే సంస్థలను స్థాపించారు. పుణే పెర్గ్యుసన్ కాలేజీలో బిఏ పూర్తి చేసుకున్న వినాయక్ దామోదర్ సావర్కర్ 'బార్-ఎట్-లా' చదువు కోసం 1906లో లండన్ బయలుదేరారు. న్యాయవిద్య పైకి ఒక సాకు మాత్రమే. అప్పటికే సావర్కర్‌కు వివాహమైంది. ఒక కుమారుడు కూడా. తెల్లవారి గడ్డ లండన్ నుంచి విప్లవోద్యమం నడపాలనే కృత నిశ్చయంతో అక్కడికి వెళ్లారు. విప్లవ కారులతో కలిసి పని చేశారు. వారందరికీ సావర్కర్ రూపంలో ఒక మార్గదర్శి కనిపించాడు.

సావర్కర్ లండన్‌లో ఉన్న సమయంలోనే అన్న గణేష్ సావర్కర్‌కు బ్రిటిష్ ప్రభుత్వం అండమాన్‌లో కారాగార శిక్ష విధించింది. సావర్కర్ న్యాయ విద్య పూర్తి చేసినా, బ్రిటిష్ రాణికి విధేయత ప్రకటించడానికి నిరాకరించినందుకు బార్ ఎట్ లా పట్టా నిరాకరించారు. సావర్కర్ కుడి భుజం మదన్‌లాల్ ధింగ్రా బ్రిటిష్ ఆర్మీ అధికారి సర్ విలియం హట్ కర్జన్ విల్లేని హతమార్చాడు. గణేష్ సావర్కర్‌కు శిక్ష విధించిన జాక్సన్ అనే అధికారిని అనంత లక్ష్మణ కర్హరే అనే విప్లవ యోధుడు కాల్చి చంపాడు. ఈ రెండు ఘటనల తర్వాత వినాయక్ దామోదర్ సావర్కర్‌పై నిఘా పెరిగింది. చివరకు ప్యారిస్ నుంచి లండన్ వచ్చిన సావర్కర్‌ను రైల్వేస్టేషన్‌లో బంధించారు. స్టీమర్‌లో భారత్‌కు తీసుకొస్తుండగా సముద్రంలో దూకి తప్పించుకునే ప్రయత్నమూ ఫలించలేదు. వినాయక్ దామోదర్ సావర్కర్‌కు న్యాయస్థానం అండమాన్ జైలులో రెండు యావజ్జీవ కారాగార శిక్షలు (50 ఏళ్లు) విధించింది. న్యాయమూర్తి ఆ తీర్పును ప్రకటిరచగానే. 'బ్రిటిష్ వారికి పునర్జన్మ మీద నమ్మకం ఉందన్నమాట' అని చమత్కరించారు ధీశాలి అయన సావర్కర్. అంతేకాదు ఆయన యావదాస్తిని ప్రభుత్వం స్వాధీనం చేసుకుంది. దీనికి స్పందిస్తూ 'దేశమంతా నాదైనప్పుడు సొంత ఆస్తి లేకపోతేనేం' అని వ్యాఖ్యానించిన మహనీయుడు సావర్కర్. 1911 జూలై 4 నుంచి ప్రారంభమైన అండమాన్ కారాగార శిక్ష ఎంతో కఠినంగా సాగింది. కొబ్బరి పీచు వలవడం, గానుగ ఆడించి నూనె తీయడం వంటి కఠిన పనులు చేయించారు.

జైలులో ఉన్న రోజుల్లో సావర్కర్ తన రచనా వ్యాసంగాన్ని సాగించారు. తోటి ఖైదీలకు చదువు చెప్పారు. కులమత బేధాలు పాటించకుండా సంస్కరించారు. దేశంలోని వివిధ వర్గాల నుంచి వచ్చిన వత్తిడి కారణంగా 1923 డిసెంబర్‌లో సావర్కర్‌ను అండమాన్ నుంచి మహారాష్ట్రలోని ఎరవాడ జైలుకు తరలించారు బ్రిటిష్‌వారు. అనంతరం 1924 జనవరి 6న రత్నగిరి జిల్లా దాటిపోవద్దు, రాజకీయాల్లో పాల్గొనరాదనే షరతులతో బ్రిటిష్ ప్రభుత్వం వీర సావర్కర్‌ను పూర్తిగా విడుదల చేసింది. సుదీర్ఘకాలం కారాగార జీవితం తర్వాత ఆంక్షలతో విడుదలైన సావర్కర్ జీవితం ద్వితీయార్థమంతా హిందూ సమాజ సంస్కరణలో సాగిపోయింది. నాటి హిందూ సమాజం అనైక్యత, అంటరానితనం, సాంఘిక దురాచారాలతో కష్టాలు పడుతోంది. సమాజంలోని ఈ అసమానతలు రూపుమాపి జాతిని సమైక్యం చేసేందుకు నడుం బిగించారు సావర్కర్. సావర్కర్ తన గ్రామంలోని హరిజనుడి ఇంట టీ తాగడం సనాతన ఆచార పరాయణులకు ఆగ్రహం తెప్పించింది. అంటరానితనం కారణంగానే మన హిందూ సమాజంలో అనైక్యత, మత మార్పిడులు జరుగుతున్నాయని గుర్తు చేశారు సావర్కర్. హిందువులు అంతా బంధువులేనని చాటి చెప్పారు. 1929లో రత్నగిరిలోని విఠలేశ్వరాలయంలోకి హరిజనులకు ప్రవేశం కల్పించారు వీర సావర్కర్. మహారాష్ట్ర అంతటా ఈ కార్యక్రమం ఒక ఉద్యమ రూపంలో కొనసాగింది. పాఠశాలల్లో అన్ని కులాల విద్యార్థులు కలిసి చదువుకునేలా ప్రోత్సహించారు. 1931లో పతిత పావన మందిరాన్ని నిర్మించి శంకరాచార్యులచే ప్రారంభించారు సావర్కర్. సమాజంలోని వివిధ వర్గాల మధ్య ఐక్యత తీసుకురావడానికి సహపంక్తి భోజనాలను ఏర్పాటు చేశారు. హిందూ సమాజం నుంచి కొన్ని వర్గాలను దూరం చేసుకోవడం అంటే మనకు శత్రువులను పెంచుకోవడమేనని గుర్తు చేసేవారు సావర్కర్. అన్యమతం స్వీకరించిన వారిని శుద్ధి ఉద్యమాల ద్వారా తిరిగి హిందూ సమాజంలోకి తీసుకొచ్చే కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. హిందూ సంఘటన కోసం సామూహిక గణేష్ ఉత్సవాలు, శివాజీ ఉత్సవాలను పెద్ద ఎత్తున నిర్వహించారు.

హిందుత్వ పేరు వినగానే ఏదో రూపంలో వీర సావర్కర్ గుర్తుకు వస్తారు. స్వాతంత్ర్య ఉద్యమ కాలంలోనే హిందువు అనే పదానికి స్పష్టమైన నిర్వచనం ఇచ్చారు సావర్కర్. హిందువనే పదం సాంస్కృతిక జీవితానికి సంబంధించినది. దేశంలో నివసించే ప్రతి వ్యక్తి ప్రాంతం, భాష, మతాలకు అతీతంగా తాను భారతీయుడినని భావించాలి. అదే మన జాతీయత అని చెప్పారు సావర్కర్. హిందుత్వం అనేది మన జాతీయతను సూచిస్తుంది. దేశంలో మతాలు ఎన్ని ఉన్నా జాతీయత ఒక్కటే. జాతీయత అనే నదిలో అన్ని మతాలు, వర్గాలు సెలయేర్లలా కలిసిపోవాలి అని కోరుకున్నారు సావర్కర్. ఏ మతం వారైనా భారతీయులే. వారు ముస్లింలైతే భారతీయ ముస్లింలు, క్రైస్తవులైతే భారతీయ క్రైస్తవులు. అంతేకాని 'ఏ మతం ప్రత్యేక జాతి కాదు' అని చెప్పారు సావర్కర్. హిందుత్వాన్ని భారత జాతీయతతో సమానంగా నిర్వచించారు సావర్కర్. ప్రపంచంలో ఎన్నో దేశాలు, జాతులు, మతాలు, సాంస్కృతులు ప్రత్యేక అస్తిత్వంతో ఉన్నట్లే హిందూ జాతీయత తనదైన గుర్తింపుతో మనుగడ సాగిస్తుంది. హిందూ సంఘటన అంటే జాతి సంరక్షణ అని చెప్పారు సావర్కర్. హిందువుల ప్రయోజనాలకు భంగం కలిగించేలా ఎవరు ప్రవర్తించినా ఘర్షణ తప్పదు. ఈ స్వీయ రక్షణ కోసం హిందూ సంఘటనోద్యమాన్ని ప్రారంభించారు వీర సావర్కర్. స్వాతంత్ర్యంతో పాటు దేశ విభజన కూడా తప్పదని చాలా ముందుచూపుతో గ్రహించారు సావర్కర్. ఆనాటి బ్రిటిష్ ఇండియా సైన్యంలో హిందువులు చాలా తక్కువ. అందుకే హిందువులు సైన్యంలో చేరాలని ప్రోత్సహించారు సావర్కర్. సావర్కర్ ఈ పిలుపు ఇవ్వడాన్ని తప్పు పట్టిన వారంతా, తర్వాత కాలంలో ఆయన దూరదృష్టిని అభినందించారు.

1938 నాటికి బ్రిటిష్ ప్రభుత్వం వినాయక్ దామోదర్ సావర్కర్‌పై అన్ని ఆంక్షలను ఎత్తేసింది. తరువాత హిందూ మహాసభకు ఆయనను అధ్యక్షునిగా ఎన్నుకున్నారు. వినాయక్ దామోదర్ సావర్కర్ స్వాతంత్ర యోధునిగానే కాక చరిత్రకారునిగా, సాహితీవేత్తగా కూడా ప్రసిద్ధులు. ఆయన గ్రంథాలు ప్రజల్లో దేశభక్తిని రగిలించేవి. ఈ కారణం వల్లే బ్రిటిష్ ప్రభుత్వం ఆయన రచనలపై గట్టి నిఘా పెట్టింది. చాలా ఏళ్ల పాటు నిషేధం కూడా అమలులో ఉంది. భారతదేశంతో పాటు విదేశీ చరిత్రలను కూడా ఎంతో లోతుగా అధ్యయనం చేసి మనకు సాహిత్య సృష్టి చేశారు సావర్కర్. సావర్కర్ 1908లో లండన్‌లో చదువుకుంటున్న రోజుల్లోనే '1857 స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర'ను రాశారు. ఆనాడు జరిగిన ఉద్యమాన్ని బ్రిటిష్ చరిత్రకారులు కేవలం సిపాయిల తిరుగుబాటుగా అభివర్ణించారు. కానీ అది స్వాతంత్ర్య సంగ్రామమని స్పష్టంగా లోకానికి చాటి చెప్పారు సావర్కర్. దీన్ని ప్రపంచంలోని పలు భాషల్లోకి అనువదించారు. బ్రిటిష్ ప్రభుత్వం ప్రచురణకు ముందే ఈ గ్రంథాన్ని నిషేధించింది. దీన్ని ముద్రణ కోసం భారత్‌లోని తన అన్న గణేష్ సావర్కర్‌కు పంపగా, బ్రిటిష్ వారు పసిగట్టారు. ఆయన్ను ఆరెస్టు చేసి అండమాన్‌కు పంపింది ఈ కేసులోనే. మహారాష్ట్రలోని అన్ని ముద్రణాలయాలపై ముందు జాగ్రత్తగా దాడులు జరిపారు. అయినప్పటికీ విదేశాల్లో ముద్రించిన '1857 స్వాతంత్ర్య సంగ్రామ చరిత్ర' రహస్యంగా భారతదేశం చేరింది. ఈ గ్రంథం ఎంతో మంది స్వాతంత్ర్య సమర వీరులకు, విప్లవ యోధులకు స్ఫూర్తినిచ్చింది. సావర్కర్ అండమాన్ జైలులో బందీగా ఉన్నప్పుడు అక్కడ విధించిన కఠిన శిక్షలకు చింతిస్తూ కూర్చోలేదు. చేతులకు, కాళ్లకూ బేడీలు వేసి శరీరాన్ని బంధించారు, కానీ మనసును కాదు అనుకునేవారు. స్వతహాగా ఆయన కవి. శిక్ష సమయంలో జైలు గోడల మీదే కవితలు రాశారు. వీటిని కంఠస్థం చేసి, గుర్తు పెట్టుకొని, తర్వాత కాలంలో గ్రంథస్తం చేశారు. కొద్ది నెలల తర్వాత జైలు సిబ్బంది ఆయనకు కాగితాలు, కలం సమకూర్చారు. అండమాన్ జైలులో ఉన్న సమయంలోనే కమల, గోమాంతక్, మహాసాగర్ తదితర గొప్ప కావ్యాలు వచ్చాయి.

1922లో జైలు గోడల మధ్యే హిందుత్వ గ్రంథ రచనకు పూనుకున్నారు సావర్కర్. హిందుత్వకు సమగ్ర నిర్వచనం ఇచ్చిన గ్రంథం ఇదే. సావర్కర్ తన ఆరోగ్యం క్షీణిస్తున్న దశలో కూడా రచనా వ్యాసంగాన్ని వదిలిపెట్టలేదు. 1963లో ఆయన రాసిన 'భారత ఇతిహాసంలో ఆరు స్వర్ణపుటలు' మన చరిత్రలోని ముఖ్య ఘట్టాలను ఉల్లేఖిస్తూ స్వాభిమానాన్ని చాటి చెప్పింది. అండమాన్ జైలులో తాను గడిపిన దుర్భర జీవితంపై రాసిన ఆత్మకథ మరాఠా సాహిత్యంలో చిరస్థాయిగా నిలిచిపోతుంది. దీని ఆధారంగా ఎన్నో రంగస్థల నాటకాలు కూడా వచ్చాయి. ఆధునిక భారతీయ రాజనీతిజ్ఞులలో సావర్కర్ ఒకరు. ఆయన మహోన్నత ఆదర్శవాది, మానవతా వాది, హేతువాది కూడా. అభ్యుదయ, వైజ్ఞానిక, శాస్త్రీయ దృక్పథాలు ఆయన రచనలు, ఉపన్యాసాల్లో కనిపిస్తాయి. సావర్కర్ జీవితం అంతా సంఘర్షణలతోనే సాగింది. బ్రిటిష్ ప్రభుత్వంతో పాటు స్వదేశీ ప్రభుత్వం కూడా ఆయనపట్ల నిర్దయగానే వ్యవహరించింది. మహాత్మాగాంధీ హత్యోదంతంలో ఆయనను అన్యాయంగా అరెస్టు చేశారు. అనంతరం నిర్దోషిగా విడుదల చేశారు. దేశం కోసం జీవితాన్ని అర్పితం చేసిన ఆ మహనీయునికి దక్కాల్సిన గౌరవాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఇవ్వలేదు. అయితే 1964లో మహారాష్ట్ర ప్రభుత్వం 'అప్రతిహతీ స్వాతంత్ర్య వీర' అనే బిరుదుతో గౌరవించింది. జీవిత చివరి దశలో తన 86వ ఏట జీవితం చాలించదలచి ఆహారాన్ని త్యజించారు సావర్కర్. 1966 ఫిబ్రవరి 26న ఈ లోకం నుంచి విముక్తి పొందారు. ఆ మహనీయుడు అందించిన స్ఫూర్తి కోట్లాది మంది భారతీ యుల్లో అగ్నికణమై చిరస్థాయిగా నిలిచిపోతుంది.



అభిషేక్ కురుమ
బజరంగ్ దళ్ రాష్ట్ర బాలోపాసన ప్రముఖ్

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

OWNED, PUBLISHED BY **BOMMAKANTI SHRAVAN KUMAR**, PRINTED BY SUNDAY PRINTING PRESS, #3-4297, SARASWATHI COMPLEX, SVN COLONY, GUNTUR - 522006, ANDHRA PRADESH. PUBLISHED AT #4-36, BALWANTHAPOOR, MALLIAL MANDAL, JAGITIAL DISTRICT - 505452, TELANGANA, EMAIL ID: contact@evarthalu.com, PHONE NUMBER: 9440455811, EDITOR: **BOMMAKANTI SHRAVAN KUMAR**, RNI REGD NO.: TGTEL/25/A1385. CORPORATE OFFICE: #1-5-431/20/4, JONNABANDA, OLD ALWAL, MEDCHAL MALKAJGIRI DISTRICT - 500010, TELANGANA. Landline: 040-35673004.